ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 26 | సంచిక : 2 | అక్టోబర్ 2020

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

06-10-1985, జిన్నూరు

అరుణాచల మహత్యం

శ్రీమద్భగవద్గీత

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 06 అక్టోబర్ 1985, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మన తెలివితేటల వల్ల, మన ప్రయత్నం వల్ల, ఇలా చెబుతున్నాము ఏమో అని మనం అనుకొంటాము. కానీ జన్మాంతర అనుబంధం వల్ల భగవాన్ అనుగ్రహమే మనలని తీసుకువెళుతుంది, ఆయన అనుగ్రహమే మనలని స్మరించేటట్టు చేస్తుంది. మనం ఇలా భగవంతుడు గురించి మాట్లాడుకోవడం వల్ల, మనకు తెలియ కుండానే మనకు భక్తి కలుగుతుంది. గీతలో భక్తి యోగం అని, కర్మ యోగం అని, యోగాలన్ని మీరు చదివి ఉంటారు. భక్తి యోగం అంటే మనకు భక్తి కలిగితే యోగం కలుగుతుంది. కర్మయోగం ఉంది అనుకోండి నిష్కామ కర్మ మనం చేస్తే కర్మల వల్ల కూడా యోగం కలుగుతుంది. ధ్యానం వల్ల యోగం కలుగుతుంది. యోగం వల్ల మనకు ఏమి వస్తుంది? మనకు అద్వైత అనుభవం వస్తుంది. అంటే ద్వైతం లేని స్థితికి మనం చేరుకుంటాము. మన పూర్వజన్మ ప్రవృత్తులను బట్టి, మన పూర్వజన్మ సంస్కారాలను బట్టి, మన ఇంద్రియాలు, మన మనసు, ఒకొక్క మార్గం వైపుకు ఆకర్షించ బడతాయి. పూర్వజన్మలో మనం చేసిన కృషిని బట్టి, ఒకోమార్గం వైపుకు ఆకర్షింపబడతాము. కర్మమార్గానికి ప్రాముఖ్యత ఇవ్వలేదు అని గౌతమ బుద్ధుడిని, ఆచార్యుల వారిని కూడా ఎక్కువ విమర్శిస్తున్నారు. నిష్కామ కర్మని గౌతమ బుద్ధుడు ఖండించలేదు. శంకరాచార్యులు వారు కూడా ఖండించలేదు. సకామకర్మని ఖండించారు. కోరికతోటి చేసే కర్మని వాళ్ళు అంగీకరించలేదు కాని, నిష్కామకర్మని వాళ్ళు ప్రోత్సహించారు. వాళు కర్మని నిరసించలేదు. అది మనం అర్థం చేసుకోవటంలో పొరపాటు.

మీరు ఒక్కటే గుర్తుపెట్టుకోండి, జ్ఞాని అబద్ధం చెప్పడు. కరెక్టుగా నూటికి నూరుపాళ్లు వాడు ట్రూతే చెబుతాడు. ఎందుచేత? వాడు ఊహించి చెప్పింది కాదు, speculation కాదు, ఏ జ్ఞాని చెప్పనివ్వండి తన అనుభవాన్ని తీసి చెపుతాడు. దానిని ఎందుకు మనం విమర్శిస్తున్నాము అంటే వారు మనకు అర్థం కాకపోవటం వలన. మన ఇంద్రియాలలో కాలుష్యం ఉంది, మన బుద్ధిలో కాలుష్యం ఉంది, మన మనసులో కాలుష్యం ఉంది. మన జీవిత విధానంలో కాలుష్యం ఉంది. అందుచేత కలుషితం అయిన ఈ బుద్ధి కాని, కలుషితం అయిన ఈ ఇంద్రియాలు కాని, కలుషితం అయిన ఈ మనసు కాని వారు చెప్పే మాటలను గ్రహించలేవు. వాళ్ళు చెప్పే మాటలని, అర్థం చేసుకునే శక్తి ఈ బుద్ధికి లేదు. ఎందుచేత అంటే ఇది కలుషితం అయిపోయింది. మనం కోరికతోటి పని చేస్తాము. అలా పని చేసినప్పుడు మనసు మనకు తెలియకుండా ఫలితాన్ని ఆశిస్తుంది. అప్పుడు కూడా మన మనస్సు కలుషితంగానే ఉంది. కలుషితం అయిన మనస్సు, ఆత్మను అన్వేషించటానికి పనికిరాదు. భగవాన్ సకామ కర్మను ఖండించారు. నువ్వు కోరికతోటి కనుక పని చేస్తుంటే, మనస్సు పాడు అవుతుంది, ఎంతసేపు ఫలితం వైపు నీ మనస్సు చూస్తూ ఉంటుంది. అంటే బహిర్ముఖం అవుతూ ఉంటుంది. అది లోపలకి తిరగటానికి అవకాశం లేదు. భగవాన్ ఉపదేశసారంలో చెపుతారు.

**ఈశ్వరార్పితం నేచ్ఛయాకృతం**
**చిత్త శోధకం ముక్తి సాధకం**

నువ్వు కోరికతోటి పని చెయ్యకూడదు. ఏదో something ఆశించి మటుకు నువ్వు ఏ పని చెయ్యకూడదు. అజ్ఞానికి, జ్ఞానికి తేడా చెప్పారు భగవాన్. అజ్ఞాని పని చేస్తాడు, జ్ఞాని పని చెయ్యడు, జ్ఞాని ద్వారా పని జరుగుతుంది అట. కృష్ణుడు పని చెయ్యలేదా? రాముడు పని చెయ్యలేదా? వశిష్టుడు పని చెయ్యలేదా? భగవాన్ పని చెయ్యలేదా? శంకరాచార్యుల వారు పని చెయ్యలేదా? వాళ్ళు పని చెయ్యటం కాదు వాళ్ళ ద్వారా పని జరుగుతుంది. అంటే నేను చేస్తున్నాను, నేను చేస్తున్నాను అనే భావన మటుకు అక్కడ ఉండదు. వ్యక్తిగతమైన తలంపు అసలు ఉండదు. అహంకార కేంద్రం ఉండదు. వాళ్ళ కేంద్రం ఈశ్వరుడే. ఆత్మే కేంద్రం. మన కేంద్రం ఎవరు? అహంకారం. ఏ పని చేసినా అహంకారమే. ఈశ్వరుడు వేరు, మనం వేరు అని అనుకుంటాం అనుకోండి. మనకు వేరుభావన ఉన్నంతకాలం ఏదోకటి అడగాలని అనిపిస్తూ ఉంటుంది. మీకు భగవంతుడు మీ స్వరూపంగా కాకుండా, వేరుగా కనిపిస్తున్నంత కాలం, వేరుగా మీరు ఉహిస్తున్నంతకాలం, మీకు ఏదోకటి తప్పనిసరిగా అడగాలి అనిపిస్తుంది. అయితే ఈశ్వరుడికి సమర్పించి చేసినటువంటి పని, అధికమైన ఫలితాన్ని ఇస్తుంది. అదే భగవంతుడు కూడా చెప్పాడు.

మనం పని చేస్తే ఫలితాన్ని ఆశించవద్దు అని భగవంతుడు చెప్పాడు కానీ ఫలితం రాదు అని ఎక్కడా చెప్పలేదు గీతలో, ఎందుచేత ఆశించవద్దు అన్నాడు. దాని వలన మన మనసు మురికి అవుతుంది కాబట్టి, మీరు ఎంత చిన్న పని అయినా చేయండి, హృదయ పూర్వకంగా, ప్రేమతోటి ఎదుటి మనిషి దగ్గర ఏమి వాంఛించకుండా, మంచి కోసమే చెయ్యండి. దానివల్ల కూడా యోగం సిద్ధిస్తుంది. ఆత్మను తెలుసుకోవటానికి డైరెక్ట్‌పాత్ ఏమిటంటే self enquiry, విచారణా మార్గం అని భగవాన్ చెప్పారు. భగవాన్ ధ్యాన మార్గం కూడా చెప్పారు. ఆత్మనే ధ్యానించమన్నారు. నువ్వు ఆత్మని విడిచిపెట్టి దేన్ని ధ్యానించినప్పటికీ ఏదోక జన్మలో అది విడిచిపెట్టాల్సిందే. భగవాన్ చెప్పింది ఏమిటంటే, ఆత్మే సత్యం కాబట్టి దానినే ధ్యానం చెయ్యండి. ఒకవేళ ధ్యానం చెయ్యటానికి మీకు అర్హత లేదు అనుకో, మీరు deserve కావట్లేదు అనుకో, ఏదోక బొమ్మ పెట్టుకుని చెయ్యచ్చు. కాని అది కూడా ఏదోక జన్మలో విడిచిపెట్టాల్సిందే. ఎవరైనా ఆత్మను తెలుసుకున్నారు అనుకోండి మాట వరసకి, మనం ఏమనుకుంటాం, చాలా గొప్ప స్థితికి వెళ్లారు అండి, వారు చాలా పెద్ద స్థితికి వెళ్లిపోయారండి. ఇలా అనుకుంటాం. కాని అది తప్పు. అది సహజ స్థితే, జ్ఞానం అనేది extraordinary state ఏమి కాదు, Normal state అన్నారు. ఇప్పుడు మన అందరికి ఏమిటి? మోక్షం పొందాలి, మోక్షం పొందాలి అని ఉంది. ఏ మతం అయినా సరే, క్రైస్తవ మతం అయినా, బౌద్ధ మతం అయినా, ఇంకో మతం అయినా అందరికీ ఇదే గొడవ. కానీ భగవాన్ ఏమంటున్నారు అంటే; ఇప్పుడు కూడా నీవు మోక్షంలోనే ఉన్నావు అని చెబుతున్నారు. మీరు ఆలోచించండి భగవాన్ చెప్పింది తప్పు అనుకుందాము, ఇప్పుడు మనం మోక్షంలో లేము. మనం కొత్తగా ఏదో సాధన చెయ్యటం వల్ల అది వస్తుంది అని అనుకుంటాము. కొత్తగా వచ్చింది ఎంతసేపు ఉంటుంది అది. ఒక అరుణాచలం స్మరణ చాలు సిద్ధి కలగటం కోసం, యోగం కలగటం కోసం. మీరేమి గుంజీలు తియ్యనక్కరలేదు. ప్రాణాయామాలు చెయ్యక్కరలేదు. ఊరికే అరుణాచలం స్మరణ మటుకు చాలు. ఈ స్మరణే చాలు జీవులు తరించటం కోసం. ఏమి అక్కర్లేదు నిన్ను స్మరిస్తే చాలు. జ్ఞాపకం ఉంచుకుంటే చాలు. అరుణాచల, అరుణాచల అని స్మరిస్తే చాలు. ఆ జీవుడు రక్షింపబడతాడు. నీ స్మరణ చాలు అన్నాడు. ఇందులో ఏమైనా కష్టం ఉందా అండి మీకు. యోగం, యోగం అంటే మీరు ఏమీభయపడి పోకండి. సన్యాస ఆశ్రమం అని, వానప్రస్థ ఆశ్రమం అని, గృహస్థ ఆశ్రమం అని, ప్రకృతి ధర్మాన్ని బట్టి ఇది పెట్టిందే కాని ఇవన్నీ కూడా మనం కల్పించుకున్నవే. మనం కల్పించుకోలేనిది ఒక్క ఆత్మ ఒక్కటే. ఇప్పుడు మనం ఆత్మలో లేమని, మోక్షంలో లేమని, దానిని సంపాదించడానికి ప్రయత్నం చేస్తున్నాం అని తలంపులు వస్తున్నాయి చూశారా, ఆ తలంపులు కూడా మనకు తెలియకుండా మన స్వరూపానికి మనలను దూరం చేసేస్తాయి.

అంతరదృష్టి కావాలి మనకు. పవిత్రుడికి అంతరదృష్టి వస్తుంది కాని, కేవలం పాండిత్యం వల్ల రాదు. భగవాన్‌తో ఒకడు నేను చాలా గ్రంధాలు చదివాను అని చెప్పాడు. అవును గ్రంధాలు చదివితే నీకు పాండిత్యం వస్తుంది. భగవాన్ నీ హృదయంలో ఉన్నాను అని చెప్పాడా? గ్రంధంలో ఉన్నాను అని చెప్పాడా? అంటే అంతర దృష్టి కావాలి మనకు. మనం చేసే పని వల్ల మనకు చిత్తశుద్ధి రావాలి. అంటే మన మనస్సు purify అవ్వాలి, కాని ఇప్పడు మనం చేసే పని వల్ల ఆరోజుకారోజు, ఆజన్మకాజన్మ మనస్సు మురికి కూపంలోకి వెళ్ళిపోతోంది. ఎందుకు వెళ్ళిపోతోంది? మనం స్వార్ధం తోటే పని చేస్తున్నాం, ఏ పని చేసినా స్వార్ధం తోటే చేస్తున్నాం. ఇందులో ఒక రహస్యం ఉంది. మీరు అద్వైత అనుభూతి పొందాలి. అద్వైతం అనేది ఒక మతం కాదు, ఒక అనుభవం, అది explain చేసేది కాదు experience చేసేది. ద్వైతులకి కూడా వాళ్ళు సాధన చేయగా, చేయగా వాళ్ళ కొచ్చే అనుభవం కూడా అద్వైత అనుభవం వస్తుంది. విశిష్ట అద్వైతులకి కూడా వాళ్ళు సాధన చేయగా, చేయగా వాళ్ళ కొచ్చే అనుభవం కూడా అద్వైత అనుభవం వస్తుంది. ఎందుకంటే ఉన్నది ఒక్కటే కాబట్టి, సత్యం ఎప్పడు కూడా రెండుగా ఉండదు. ఒకటిగానే ఉంటుంది. ఆత్మ కూడా ఎప్పడు రెండుగా ఉండదు, ఒకటిగానే ఉంటుంది. సత్యం దగ్గరకు వెళ్ళేటప్పటికి ఒకటిగానే కనిపిస్తుంది. అద్వితీయం అంటే ద్వితీయం లేనిది అని. ఎవరైనా సరే వాడు సత్యాన్ని తెలుసుకునేటప్పటికి, వాడు సత్యం దగ్గరకు వెళ్ళేటప్పటికి, వాడు అనుభవించేది అద్వైత అనుభూతే. మనం ఇంటి దగ్గర నుంచి వెళ్లిపోదాము అనుకుంటున్నాం అనుకోండి, ఇక్కడ భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే సరే వెళ్ళిపోతావు, ఎక్కడికి వెళ్ళిపోతావు? అడవికి వెళ్ళిపోతావు. అక్కడ కూడా ప్రపంచం ఉంది. ఇక్కడ మనుషులు ఉంటారు. అక్కడ చెట్లు ఉంటాయి. పోనీ ఇంకో చోటికి వెళ్ళిపోతావు. ఎక్కడికి వెళ్ళినా నీ కూడా నీ మనస్సు వస్తుంది. ఆ మనస్సనే సమస్యని ఇక్కడ పరిష్కరించలేక పోతున్నావు. అక్కడేమి పరిష్కరిస్తావు. ఈ మనస్సనే సమస్యను ఏదోక జన్మలో పరిష్కరించి తీరాల్సిందే. దేహానికి మరణం కాని, మనసుకి మరణం లేదు. నువ్వు ఎవరో నువ్వు తెలుసుకునే వరకూ అది నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. వివిధ రూపాల్లో నీ కూడా వస్తూనే ఉంటుంది. అది జ్ఞానాగ్ని వల్ల కాలవలసిందే కాని కట్టెల వల్ల వచ్చే అగ్ని వల్ల కాలదు. కొన్ని కొన్ని సమస్యలు మనం ఈరోజు పరిష్కారం చెయ్యలేము. రేపు చేస్తాము అని ఎక్కడుంది? లేకపోతే next జన్మలో చేస్తాము అని ఎక్కడుంది? లోక అనుభవంలో మనం సాధన చేస్తున్నాం అండి, తక్కువో, ఎక్కువో సాధన చేస్తున్నాం. మంత్రాలు చేస్తున్నాం, అది చేస్తున్నాం. కాని అభివృద్ధిలోకి వెళ్లలేకపోతున్నాం. వాడు అభివృద్ధి కాలేదు అంటే వాడికి వైరాగ్యం లేదు అని అర్థం. ఆత్మచింతన లేనివాడికి వైరాగ్యం లేదు. వైరాగ్యం ఉన్నవాడికి తప్పనిసరిగా అభివృద్ధి

కనిపిస్తుంది. తెలిసున్నా మనం ఆత్మే, తెలియకపోయినా మనం ఆత్మే. అయితే తెలియకపోవడం వల్ల దుఃఖం వస్తుంది. తెలియడం వల్ల సుఖం వస్తుంది. నిష్కామకర్మ వల్ల ఫలితం రాదు అని మీరు అనుకోకండి. నిష్కామకర్మ వలన రెండు లాభాలు ఉన్నాయి, ఫలితం కూడా వస్తుంది, చిత్త శుద్ధి కూడా కలుగుతుంది.

మనస్సు ఎంత సూక్ష్మం అయితే, మనస్సు ఎంత పరిశుద్ధం అయితే, మనస్సు ఎంత ఏకాగ్రం అయితే, అప్పుడు అది హృదయం వైపుకి ప్రయాణం చేస్తుంది. నేను జ్ఞాని అవ్వాలి అని భగవాన్ అనుకున్నాడా? మనం సక్రమమైన మార్గంలో ప్రయాణం చేస్తుంటే, మనకు తెలియకుండానే మనం గమ్యానికి చేరతాము. మీరు ప్రత్యేకంగా కోరక్కరలేదు. ప్రయాణం చేసే మార్గం, కరెక్టు అయితే మనకు తెలియకుండానే మనం గమ్యం లోకి వెళ్ళిపోతాము. అహంకారానికి శక్తి ఏమిటి? శక్తి ఈశ్వరుడే. భగవాన్ చెబుతారు అక్షరమణమాలలో నీ ఇష్టమే నా ఇష్టం, నీ కోరికే నా కోరిక. నీ సంకల్పమే నా సంకల్పం. ప్రత్యేకంగా నేను అనేవాడు లేడు. నీ సుఖమే నా సుఖం. నీ సంతోషమే నా సంతోషం. మీరు ఏమీ కోరికలు లేకుండా, ప్రేమ ప్రేమ కోసమే, పని పని కోసమే అన్నట్టు మీరు పని చెయ్యండి, అపుడు మన మనస్సు ఎంత పల్చబడుతుందో మీరు చూడండి. మనం ఒక పని చేస్తాం, మనం అనుకుంటాం వైకుంఠంలోని నారాయణుడు చూశాడా? కైలాసంలో శివుడు చూశాడా? అని, మనకొచ్చే ప్రతీ తలంపుకి కూడా ఈశ్వరుడే సాక్షి. మనం ఏ పని చేస్తున్నాం అనేది ముఖ్యం కాదు. ఎలా చేస్తున్నాం? ఏ ఉద్దేశంతోటి చేస్తున్నాం? ఏ ప్రేరణ వల్ల చేస్తున్నాం? దాన్ని బట్టి మనకు మార్కులు పడతాయి. జ్ఞాని అసలు తనకంటే లోకాన్ని వేరుగా చూడడు. ఒక భక్తుడు భగవాన్‌తో ఏవండీ క్రీస్తు లాగా, కృష్ణుడు లాగా, నాకు చాలా గొప్ప పనులు చెయ్యాలి అని ఉంది అన్నాడు. అప్పుడు భగవాన్ అన్నారు, నేను చాలా గొప్ప పనులు చేశాను అని క్రీస్తు కాని, కృష్ణుడు కాని మీకు ఎప్పుడైనా చెప్పారా? అని అడిగారు. నీ ఆలోచన పరిధిలో, నీ చిన్న మనసుతోటి నువ్వు ఊహించుకుంటున్నావు వాళ్ళు చాలా గొప్ప పనులు చేశారు అని, ఊరికే నువ్వు అనుకుంటున్నావు వాళ్ళు అలా అనుకోలేదు. మేము గొప్ప పనులు చేస్తున్నాం అని వాళ్ళు చేసేటప్పుడు అనుకుంటే వాళ్ళు జ్ఞానులే కాదు. లోకం వేరుగా నాకు కనిపిస్తుంది. నేను ఇన్ని గొప్ప పనులు చేశాను. లోకంలో అందరూ ఇలా చెప్పుకోవాలి అనుకుని ఎప్పుడూ జ్ఞాని చెయ్యడు అట. తనకంటే వేరుగా ఏమీ చూడడు. ఈ మనస్సు పోతే, ఈ అహంకారం పోతే, ఈ నేను అనే బుద్ధి పోతే, ఏమిటి? మనం ఏమి అయిపోతాము అని కొంతమందికి భయం వేస్తుంది. చాలామంది వాళ్ళకున్న అహంకారమే ఆత్మ అనుకొంటున్నారు. అహంకారం ఆత్మ ఎలా అవుతుంది? అహంకారం గంట గంటకి మారుతూనే ఉంటుంది. గంట గంటకి మారేది

నిజం అవుతుందా? అదే గనుక నిజం అయిన ఆత్మ అయితే అలా గంట గంటకి మారదు. భగవాన్ చెబుతారు కదా అక్షరమణమాలలో మొగ్గ పఱిపి నన్ను, మొగ్గ పఱిపి అంటే నన్ను బోడి చెయ్యి. నా ఆధారాలను ఊడగొట్టు, నా అహంకారం యొక్క పునాదులను తీసేయ్. నా అజ్ఞానాన్ని తీసేయ్. అరుణాచలా! నన్ను నగ్నం చెయ్యి. నా హృదయంలోని వాసనలని, ఈ సంస్కారాలని కాల్చి బూడిద చేసేయ్. నన్ను బోడి చెయ్యి. నన్ను అహంకారం లేని స్థితికి తీసుకువెళ్ళు. నన్ను బోడి చెయ్యి అంటే అహంకారం లేని స్థితిని ప్రసాదించు. అలా ప్రసాదిస్తే, ఎప్పుడైతే నన్ను అహంకార రహితుడిని చేసావో, అజ్ఞాన రహితుడిని చేసావో, కాలుష్య రహితుడిని చేసావో, ఎప్పుడైతే నా మచ్చలు అన్నీ తీసేసావో, అప్పుడు ఏమి చేస్తావు నువ్వు? నట్టాడతావు అంటే నాట్యం చేస్తావు. చిదంబరం ఎక్కడుంది? మన హృదయంలోనే చిదంబరం ఉంది. చిదంబరంలో ఈశ్వరుడు నాట్యం చేస్తూ ఉంటాడు. చిదంబరం వెళ్ళిన వాళ్ళు చూసే ఉంటారు. నాట్యం చేస్తూ ఉంటాడు. అది ఆనంద నాట్యం. అది శాంతి నాట్యం. నేను అహంకార రహితుడిని కనుక అయితే, నీ దయవల్ల నా అహంకారం పోగొట్టుకోగలిగితే, అప్పుడు నువ్వే నా హృదయంలో నాట్యం చేస్తుంటావు, ఏమి నాట్యం అండి? శాంతి అనే నాట్యం, ఆనందం అనే నాట్యం. నా హృదయంలోనే ఉన్నావు నువ్వు, ఏదైనా నన్ను నేను పోగొట్టుకుంటేనే నువ్వు నాకు దొరుకుతావు అయ్యా, నన్ను నేను పోగొట్టుకోవాలి, నన్ను నేను పోగొట్టుకుంటే నువ్వు దొరుకుతావు. నట్టాడటం ఎందుకు అరుణాచల? ఎప్పుడైతే నా అహంకారం నిర్మూలన అయ్యిందో, నా అజ్ఞానం ఎప్పుడైతే బూడిద అయిపోయిందో, నా అజ్ఞానం ఎప్పుడైతే మట్టి అయిపోయిందో, అప్పుడు నా హృదయంలో నువ్వు నాట్యం చేస్తావు. అప్పుడు ఆనందం అంటే ఎలా ఉంటుందో, శాంతి స్వరూపం ఎలా ఉంటుందో, కాంతి స్వరూపం ఎలా ఉంటుందో, ఆనంద స్వరూపం ఎలా ఉంటుందో అప్పుడు నాకు అనుభవంలోకి వస్తుంది. ఎప్పుడు? నేను బోడి అయినప్పుడు, నేను బోడిని అయినప్పుడే నాకు తెలుస్తుంది అది. బోడి అంటే ఈ జుట్టు పీకేయటం అని అనుకోకండి. అహంకారం లేని స్థితి. సుఖం అనుభవించాలి అంటే, శాంతి అనుభవించాలి అంటే, ఆనందం అనుభవించాలి అంటే ఒక్క జ్ఞానికే సాధ్యం. సుఖం అనేది ఎలా ఉంటుందో, శాంతి అనేది ఎలా ఉంటుందో, ఆనందం ఎలా ఉంటుందో సత్యం మీకు అనుభవంలోకి వచ్చినప్పుడే తెలుస్తుంది. ఏవండీ, ఆ ఆనందం ఎలా ఉంటుందో, ఎంత అద్భుతంగా ఉంటుందో, ఎంత అపూర్వంగా ఉంటుందో, ఎంత ఉదాత్తంగా ఉంటుందో, ఎంత నిర్మలంగా ఉంటుందో అది, ఎంత లేకపోతే భగవాన్ ఈ మాట అంటారు చెప్పండి. బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు, శివదేవుడు ముగ్గురు కలిసి వచ్చి మిమ్మల్ని ఏమైనా కోరుకోమంటే కోరుకుంటారా అని భగవాన్‌ను అడిగితే తప్పనిసరిగా కోరుకుంటాను. ఏమని

కోరుకుంటారు? మీరు ఎప్పుడు కనిపించవద్దని అడుగుతాను, అంటే సృష్టిని దాటి ఎలా ఉన్నాడో చూడండి భగవాన్. కొంతమంది నాకు దేవుడు కనపడటం లేదండి, నాకు దేవుడు కనపడటం లేదండి అంటారు. మీకు రాముడు కనిపిస్తాడు అనుకోండి ఎంతసేపు చూస్తారు అండి మీరు, ఆయన ఎంతసేపు ఉంటాడు? ఈ లోపల మీరు అడిగేవి ఉంటే అడిగేస్తారు. పోనీ ఆయన ఇచ్చేస్తాడు. వాటిని ఎంతసేపు అనుభవిస్తారు.

**కృతిమహోదధౌ పతనకారణం।**
**ఫలమశాశ్వతం గతినిరోధకం॥**

మీరు ప్రాపంచిక విషయాలను enjoy చెయ్యండి మీరు, ప్రకృతి విషయాలను enjoy చెయ్యండి. లేకపోతే భగవంతుడు ఇచ్చిన వరాలను మీరు enjoy చెయ్యండి. అది గనుక మీరు అనుభవించడం మొదలు పెట్టారా, ఈ జన్మలోనే కాదు, భవిషత్ జన్మలో కూడా అసలు మోక్షమార్గం మీకు మూసివేయ బడుతుంది. ఫలం అశాశ్వతమే కాదు, అది గతి నిరోధకం గతి అంటే మోక్షం, మోక్షానికి వెళ్ళకుండా మీకు ద్వారాలు మూసి వేయబడతాయి. స్వార్థం తోటి ఏ పని చేసినా అది తప్పనిసరిగా మన ముక్కు పట్టుకుంటుంది. మనం పని చేస్తాం అది వాసన అయ్యి లోపలికి ప్రవేశిస్తుంది. మనం ఏమనుకుంటున్నాం, చిట్టా ఆవర్జాలు ఎక్కడో యమధర్మరాజు రాస్తాడు అనుకొంటున్నాము కాని రాసేది మన హృదయమే. మనం చేసే ప్రతి మంచి పని, ప్రతి చెడ్డ పని, మనకొచ్చే ప్రతీ సంకల్పం కూడా మన హృదయమే దాచిపెట్టి మనకు ఇస్తుంది. మనం ఏమనుకుంటాం? ఎక్కడో దేవుడు ఉన్నాడని వాడు దాచిపెడతాడు అని అనుకుంటాం. పరమ లోభి వాడి కంటే అన్యాయం అయినది ఈ హృదయం. ఎక్కడో యమధర్మరాజు రాస్తాడు అని ఈలోపు escape అవ్వచ్చు అని మనం అనుకుంటున్నాం. కాని మన హృదయమే అన్నీ రికార్డు చేసేది. ఏ సంస్కారాలు అయితే మనం పెంచుకుంటున్నామో ఆ ముడులు అన్నీ మన చేతులతోటే విప్పకొని రావాలి. హృదయం వైపుకి ఒక అంగుళం కూడా దిగడం కష్టం. ఎంతో భక్తి ఉంటే కాని అసలు హృదయం వైపుకి దిగలేము. రామకృష్ణ పరమహంస గారు చెప్పేవారు నువ్వు ఈశ్వరుడి వైపు ఒక్క అడుగు వెయ్యి, ఈశ్వరుడు నీ వైపు తొమ్మిది అడుగులు వేస్తాడు. భగవాన్ చెప్పేది అది కూడా కాదు, ఆపరేషన్ చేయించుకున్న వాడికే తెలియదు ఆపరేషన్ జరిగినట్టు, అటువంటి కేసు భగవాన్ చెప్పారు.

**ఎవరు గనక నాదు మదిని మైకపరచి**
**కొల్లగొనిన దెవ రరుణాచలా**

అసలు నేను ఏ స్థితికి వచ్చానో ఆ స్థితికి వచ్చినట్టు నాకే తెలియదు అయ్యా, మోక్షం అనేది ఒకటి ఉందని, దానిని పొందాలి అని అసలు ఆయనకు ఏమి తెలియదు. ఎవరు

గనక నాదు మదిని మైకపరచి నన్ను మైకంలో పెట్టి నా మనసుని దొంగిలించావయ్యా నువ్వు, ఓ అరుణాచలేశ్వరుడా నువ్వు దొంగ వాడివి అయ్యా, నాకు తెలియకుండానే నన్ను దోచేశావు. అజ్ఞానాన్ని పోగొట్టుకోవడానికి ఏదో కష్టపడి సాధన చేస్తున్నాం. Progress ఎలా ఉన్నా suffering ఎక్కువ అయిపోతోంది. రమణ భగవాన్ అదృష్టం చూడండి. ఈ అజ్ఞానాన్ని ఎలా దోచేసావో, ఎప్పుడు దోచేసావో నాకు తెలియదు. నా కొంప పడగొట్టేసావు. ఊరికే అరుణాచలా అన్నాను అంతే, నాకు తెలియకుండానే నువ్వు ఈ పని అంతా పూర్తి చేసేసావు. ఈ జ్ఞాన సింహాసనం మీద ఎలా కూర్చోబెట్టావో కూడా నాకు తెలియదు. కాని కూర్చోబెట్టావు. మనం ఏ విషయం ఆలోచించినా బాహ్య దృష్టితోటి ఆలోచిస్తున్నాం. మనకు అంతర దృష్టి లేదు కదా, ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు? మన హృదయంలోనే ప్రకాశిస్తున్నాడు. మనకు సరిగా యోగ్యత, అర్హత వచ్చేటప్పటికి అజ్ఞానాన్ని మాడ్చేసి ఊరుకుంటాడు. మనకు తెలియకుండానే ఆ పని పూర్తి అయిపోతుంది. మనసు అంతా శుద్ధి చేసేస్తాడు. మన హృదయంలో సాక్షాత్తుగా ప్రకాశిస్తున్నాడు. ఓ అరుణాచలా, ఎవరు నా అజ్ఞానాన్ని కొల్లగొట్టారు. ఎవరు నా మనసుని కొల్లగొట్టారు. ఇదంతా నాకు తెలియకుండానే జరిగిపోయింది. మనకు అర్హత లేకపోతే, మనం deserve కాకపోతే మనం కోరుకొన్నా రాదు. మనకు అర్హత కనుక ఉంటే కోరిక లేకపోయినా వస్తుంది. అది జ్ఞాపకం ఉంచుకోండి, భక్తి భావం పెంచుకోవాలి. గణపతిశాస్త్రి ఎప్పుడూ భగవాన్‌ని ఏదోక ప్రశ్న అడుగుతూ ఉండేవారు, భగవాన్ ఆయనతో చెప్పేవారు మీ భారం అంతా ఈశ్వరుడి మీద వెయ్యండి. ఆయన మోయగలడు. ఈ లోకం బరువు అంతా మోసే ఈశ్వరుడు నీ ఒక్కడి బరువు మోయలేడా? మీరు నిశ్చింతగా ఉండండి, మీ భారం మొత్తం ఈశ్వరుడి మీద వేయండి. మనం అందరం దేహం తోటి తాదాప్యం పొందుతాము. ఈ దేహంతోటి తాదాప్యం, సాధన లేకుండా పోయింది ఆయనకి. నాకు ఒక శరీరం ఉందని, ఆ శరీరానికి రెండు చేతులు ఉన్నాయని, అందులో ఒక చేతి మీద కురుపు ఉందని మీరు చెబుతుంటే నాకు తెలుస్తుంది అన్నారు భగవాన్. మనం ఈ శరీరం తోటి ఎలా అయితే తాదాప్యం పొంది ఉంటామో, మనకున్న అహంకారం తోటి మనం ఎలా అయితే తాదాప్యం పొంది ఉంటామో, జ్ఞాని ఆత్మతో అలా తాదాప్యం పొందుతాడు. ఓ అరుణాచల, నాకు తెలియదు అయ్యా, నాకు తెలియకుండానే నువ్వు ఇదంతా చేసేసావు. నా అజ్ఞానం ఎలా పోయిందో, నా అహంకారం ఎలా పోయిందో, నాకు తెలియకుండా ఈ ప్రక్రియ అంతా పూర్తి చేసేసావు. నా బ్రతుకు హరించావు. భగవాన్ మౌనమే భగవాన్ యొక్క స్పీచ్. ఆయన మౌనంతోటి చెప్పింది ఎక్కువ, మాటలతోటి చెప్పింది తక్కువ. భగవాన్ గంటల తరబడి మౌనంగానే ఉండేవారు. మనం ఏదైనా అడుగుతూ ఉంటే తగినట్లు రెండు ముక్కలు చెప్పేవారు అంతే.

జ్ఞాని ఎప్పుడు తానుగా ఉంటాడు కాని నేనుగా ఉండడు. అజ్ఞాని నేనుగా ఉంటాడు. జ్ఞాని తానుగా ఉంటాడు. కొండగుర్తు కోసం చెబుతున్నాను, మీరు ఏదో ఒక మంచి పని చేస్తే, దానికి ఎవరైనా మిమ్మల్ని పొగిడితే మీకు సంతోషం కలుగుతుంది, పైకి మీరు చెప్పనక్కరలేదు. లోపల మీకు ఎంతో కొంత సంతోషం కనుక వస్తే అది ఎక్కువగా అహంకారం తోటి చేసిన పని. మిమ్మల్ని పొగిడినప్పుడు కూడా మీ మనస్సు నిర్వికారంగా ఉండాలి. అప్పుడు కూడా మీకు వికారం కలగకూడదు. భగవాన్ ఏమి చెబుతారు అంటే, మీరు జ్ఞానం సంపాదించక్కరలేదు. మీరు పోగొట్టుకోవలసింది అజ్ఞానాన్ని. మీరు జ్ఞానులే, మీరు ఆత్మ అయి ఉన్నారు. మీరు పోగొట్టుకోవలసింది అజ్ఞానాన్ని. మనకు తెలిసి ఉన్నా మనం ఆత్మ స్వరూపులమే. మనకు తెలియకపోయినా మనం ఆత్మ స్వరూపులమే. మనకు తెలిసున్నా జ్ఞానం ఉంది, తెలియకపోయినా జ్ఞానం ఉంది. కాని మనకు అనుభవంలోకి రావటం లేదు. ఎందుచేత మనకు అనుభవంలోకి రావటం లేదు అంటే మన అజ్ఞానమే మనకు అడ్డు వస్తోంది. ఆ అజ్ఞానం తొలగించు కోవడం కోసం ఈ సాధనలు అన్నీ. మనకు ఎవరైనా జ్ఞాని కనిపిస్తే ఆశ్చర్యంగా చూస్తాం. వీడు జ్ఞాని, జ్ఞాని అని. అజ్ఞాని కనిపిస్తే ఆశ్చర్యంగా చూడము. భగవాన్ ఏమి చెప్పారంటే, జ్ఞానిని చూసినప్పుడు మనకు ఆశ్చర్యం కలగకూడదు, అజ్ఞానిని చూస్తేనే ఆశ్చర్యం కలగాలి అట. ఎందుచేత? జ్ఞానం అనేది naturalstate. అజ్ఞానం అనేది unnaturalstate. ఆరోగ్య వంతున్ని ఎవరిని అయినా చూస్తే మనకు ఆశ్చర్యం కలుగుతుందా అండి. మన ఈ చదువుల్ని కూడా learned ignorance అన్నారు భగవాన్. ఇది బుద్ధి యొక్క పరిధిలోనిది, మనసు యొక్క పరిధిలోనిది. స్వామి, స్వామి మా గురువు గారి దగ్గర నేను మంత్రం పుచ్చుకున్నాను. జపాలు చేస్తున్నాను. మా గురువుగారు ఏమి చెప్పారంటే జపాలు చెయ్యమన్నారు. ఆ జపం వల్ల వచ్చే ఫలితాన్ని ఆయనకి ఇచ్చేయమన్నారు. వచ్చిన ఫలితం అల్లా ఆయన పుచ్చేసుకుంటారు, జపం మటుకు నన్ను చేయమన్నారు. నేను అలా చేస్తున్నాను అని భగవాన్ దగ్గర ఎవరో అన్నారు, నీ గురువు చాలా మంచివాడు అయ్యా, ఈ గురువు ఉన్నాడు చుశావు అసలు తినేస్తాడు, వడ్డీ తినేస్తాడు అన్నారు. మరి జపం చేసేవాడు ఎవడు? నీ గురువు గారు జప ఫలితాన్ని పుచ్చుకుంటున్నారు కాని, జపం చేసేవాడిని వదిలేశారు. జపం చేసే జపి ఎవరు? ఈ గురువు ఏమి చేస్తాడు అంటే ఆ జపిని కూడా తినేస్తాడు. జపం చేసేవాడు ఎవడూ ఇంక మిగలడు. మన ఉద్దేశం ఏమిటి? మనం జపం చేస్తూ ఉండాలి. దేవుడు ఎదురుగా ఉండాలి. ఈ జపానికి ఫలితం దేవుడు ఇస్తూ ఉండాలి. దానిని మనం ఎంజాయ్ చెయ్యాలి, మామూలుగా జనాలు అందరూ చేసేది అసలు కామ్య కర్మలే కదా. కాని మనం చేసే దాని వలన పరమేశ్వరుడి ప్రీతి పొందాలి. పరమేశ్వరుడికి సంతోషం కలగాలి. పరమేశ్వరుడికి

మన మీద అనుగ్రహం కలగాలి అని ఎవరైనా జపం చేస్తున్నారా. మీ అనుభవంతో చెప్పండి. లోపల ఏదోక కోరిక పెట్టుకుని పరమేశ్వరుణ్ణి ధ్యానం చేస్తున్నారు అనుకోండి మాట వరసకి. అప్పుడు మనం కోరికని ధ్యానం చేస్తున్నామా? దేవుణ్ణి ధ్యానం చేస్తున్నామా? ఇది కూడా మీరు ఆలోచించండి. మీ కోరికలే మీకు ఎక్కువ జ్ఞాపకం వస్తాయి దేవుడి కంటే కూడా. అప్పుడు మీరు ధ్యానం చేసేది దేవుడినా? మీ కోరికనా? ఇంక మనకు మోక్షం ఎలా వస్తుంది అండి. జపం చేసినా, ధ్యానం చేసినా, పూజ చేసినా, ఏది చేసినా పరమేశ్వరుడి ప్రీతి కోసం కనుక మనం చేస్తూ ఉంటే, ఆత్మ వైపు మన ప్రయాణం సాగుతూ ఉంటుంది. నీ అవసరాలు అన్నీ ఈశ్వరుడు తీరుస్తాడు. మన అవసరాలు ఏంటో మన కంటే ఎక్కువ ఈశ్వరుడికి తెలుసు. పరమేశ్వరుడి ప్రీతి కోసమే కనుక మనం పని చేస్తుంటే, మన అవసరాలు తీరిపోతుంటాయి. మనకు తెలియకుండా మనం ఆత్మ వైపుకి, సత్యం వైపుకి, ప్రయాణం చేస్తూ ఉంటాం. అంటే మనకు రెండు లాభాలు ఉంటాయి. మనం చేసే పనుల వల్ల లోకం సంతోషిస్తుందా? లేదా? అని మనం చూసుకుంటాం కాని, పరమేశ్వరుడు సంతోషిస్తున్నాడా? లేదా? అనేది మనం చూసుకోం. చివరికి లోకం మనకు శోకం తీసుకువస్తుంది. మనం ఈశ్వరుడి ప్రీతి పొందాలి, మనకు జ్ఞానాన్ని ప్రసాదించేది ఈశ్వరుడే. ఈశ్వరుడి ప్రీతి కోసం మనం పని చేస్తూ ఉంటే, అలా కొంచెం మనం చేయవలసిన పని చేస్తే ఆయన చేయవలసిన పని ఆయన పూర్తి చేసేస్తాడు. మనం కనుక సహృదయంతో, సద్బుద్ధితోటి పని చేస్తుంటే, ఈశ్వరుడు మన మనసుని లోపలికి గుంజుకుంటాడు. మనం మనస్సుని అక్కడికి పంపలేము. ఆనందం అనేది, శాంతి అనేది మనకు స్వరూపంగా అనుభవం అవ్వాలి. మనకంటే వేరుగా ఉంది అనుకోండి, వేరుగా ఉంటే వేర్పాటు తప్పదు. దేవుడు కాని, శాంతి కాని, ఆనందం కాని మనకంటే వేరుగా ఉంది అనుకోండి, వేరుగా ఉన్నంత సేపు వేర్పాటు తప్పదు. ఆ పరమస్థితి మనకు స్వరూపంగా అనుభవం అవ్వాల్సిందే. నువ్వు ఏ పని చేసినా ఆడంబరం లేకుండా పని చేస్తుంటే, నిర్మలంగా పని చేస్తుంటే, భగవంతుడి కోసం మనం పని చేస్తుంటే, భగవంతుడి సంతోషం కోసమే మన జీవితాన్ని సమర్పిస్తే, ఆయన ప్రీతి కోసమే మనం పని చేస్తే, మనకు తెలియకుండానే భగవంతుడి వైపు మన ప్రయాణం సాగిపోతూ ఉంటుంది. ఈశ్వరానుభవం అయ్యేవరకూ మనకు ఈ శవాలు మోయటం తప్పదు. ఈశ్వరుణ్ణి మీరు జడవస్తువు అనుకోకండి. ఈ లోకంలో చేతన వస్తువు ఈశ్వరుడు ఒక్కడే. మిగతాది అంతా జడం, దేహం జడం, లోకం జడం, అన్నీ జడమే. ఈ శరీరం జడం కాదు అనుకోండి, చైతన్య వస్తువు అనుకోండి శరీరం లేచి అడుగుతుంది అట. ఏమిటయ్యా? నన్ను స్మశానానికి తీసుకెళ్ళి తగులబెట్టేస్తున్నావు. నీకు న్యాయంగా ఉందా? అని, ఇప్పుడు ఏ శవాలు అయినా

అడుగుతున్నాయా, శవానికి కూడా నోరు ఉంది కదా మరి ఎందుకు అడగట్లేదు నన్ను ఎందుకు తగలబెట్టేస్తున్నారు. నన్ను ఎందుకు తీసుకు వెళ్ళిపోతున్నారు అని ఎందుకు అడగట్లేదు. ఇది జడవస్తువే, అప్పుడు ఇప్పుడు కూడా అది జడమే. మనల్ని బంధించేది సిమెంటు కాదు, కంకర కాదు. దేహమే మనలని బంధిస్తుంది. ఈ దేహాన్నే కేంద్రంగా పెట్టుకుని జన్మించాను. ఈ దేహాన్నే కేంద్రంగా పెట్టుకుని జీవిస్తున్నాను. ఈ దేహాన్నే కేంద్రంగా పెట్టుకుని మరణిస్తున్నాను. మరణించేటప్పుడు కూడా నేను మరణిస్తున్నాను, నేను మరణిస్తున్నాను అనుకుంటాడు. దేహం పోతుంది, వాడు కూడా పోతున్నాడు అనుకుంటాడు. నిజంగా దేహం పోయినప్పుడు మనం పోతే ఫరవాలేదు. కాని అలా పోము అంటున్నాడు ఈశ్వరుడు. దేహం నేను అనుకోవడం వల్ల ఈ కష్టం అంతా వస్తోంది. మనం పని చేసేది కూడా దేహం కోసమే పని చేస్తాం. ఇదంతా మన అనుభవంలో ఉంది కదా. అంటే ఇటువంటి శవాలు భవిషత్తులో అనేక శవాలు రావడం కోసం ఈ రకంగా మనం పని చేస్తున్నాము. పండితుడు చేసే పనీ అదే, పామరుడు చేసే పనీ అదే, ధనవంతుడు చేసే పనీ అదే, దరిద్రుడు చేసే పనీ అదే. అందరూ దేహం కోసమే చేస్తారు. గౌతమ బుద్ధుడు శరీరం విడిచిపెట్టేటప్పుడు, వాళ్ళ తమ్ముడు అడుగుతాడు. ఈ శరీరాన్ని ఎక్కడికి తీసుకు వెళ్ళమంటావు? ఎక్కడ దహనం చేయమంటావు? ఆయన చెప్పింది చూడండి, వాళ్ళు ఎక్కడ ఉన్నారో చూడండి. అందరి శరీరాలను తీసుకెళ్ళి ఎక్కడ దహనం చేస్తున్నారో ఈ శరీరాన్ని కూడా తీసుకెళ్ళి అక్కడే దహనం చేయండి అంటాడు బుద్ధుడు. తన అన్నగారిని చూసి విలపిస్తాడు గౌతమ బుద్ధుడి తమ్ముడు. ఎందుకు నా కోసం ఏడుస్తావు? నా కోసం ఏడిస్తే నీకు ఏమి వస్తుంది? నీకు ఇంకా జ్ఞానం కలగలేదు అని, నీ కోసం నువ్వు ఏడువు. నా కోసం ఏడిస్తే నీకు ఏమి వస్తుంది? నువ్వు ప్రయత్నం చేసి జ్ఞానాన్ని సంపాదించుకో. నీ అంతటి మహాత్ముడు పూర్వం ఎవరూ జన్మించి ఉండలేదు అని చెప్పాడు తమ్ముడు. మనం అయితే మహా బాగా చెప్పాడు అనుకొంటాము. కాని బుద్ధుడు ఏమంటున్నాడో చూడండి - పూర్వం మహాత్ముల చరిత్రలు అన్నీ నువ్వు చదివావా అంటాడు. చదవలేదు అని చెప్పాడు. వాళ్ళ గురించి చదవకుండా, వాళ్ళ గురించి వినకుండా నా అంతటి గొప్పవాడు ఎవడూ లేడు అని నీకు ఎలా తెలుసు? పూర్వం జన్మించిన మహాత్ముల గురించి ఏమి తెలియకుండా, నా కంటే మహాత్ములు లేరని చెబుతావు ఏమిటి? వాళ్ళ గురించి నీకు ఏమి తెలుసు? అన్నాడు. అంటే ఆయన ఎక్కడ ఉన్నారో చూడండి. భగవంతుని కనుక మీరు ప్రార్థిస్తుంటే, మీరు ప్రార్థన చెయ్యండి. భగవంతుడిని ఎందుకు ప్రార్థించాలి? కేవలం ఆయన అనుగ్రహం కోసం ప్రార్థించాలి. ప్రార్థన ఎందుకంటే కేవలం ఆయన అనుగ్రహం కోసం. ఆయన అనుగ్రహం వస్తే మనకు అంతా వచ్చినట్టే. ఆయన

అనుగ్రహం లేదు అనుకోండి మనకు ఏమి లేనట్టే. మన హృదయంలో ఉన్న శాంతి మనకు అందనప్పుడు ప్రకృతిని చూసి అన్నీ కోరికలు కోరాలని ఉంటుంది మనకు. మనం హృదయంలోకి దిగాలి. మన హృదయంలో ఉన్న శాంతిలో మన మనస్సు, మన ఇంద్రియాలు కూరుకు పోతుంటే, ప్రకృతి గొడవలన్నీ పోతాయి. ఈ ప్రకృతి మనలని బంధించటం మానేస్తుంది. ప్రకృతిని దాటినవాడు కాని జ్ఞాని కాలేడు. జ్ఞాని బ్రహ్మస్వరూపుడు. ఆయనకు తనకంటే వేరుగా ఏదైనా ఉంటే కదా కలవటానికి మనస్సు. అంతా తానుగానే కనిపిస్తున్నాడు. ఇంక మనస్సు ఎక్కడికి వెళుతుంది. ద్వైతబుద్ధి ఉంటే భయం వేస్తుంది. ద్వైతబుద్ధి ఉంటే కామం వస్తుంది. ద్వైతాన్ని దాటినవాడికి ఇంకేముంది? ఇంక మనస్సు ఎక్కడికి వెళుతుంది, ఏ కోరికలు కోరుతుంది? అసలు కోరటానికి ఏముంది ఈ లోకంలో, నిజమైన గురువు చేతిలో పడితే తాచు పాము నోట్లో పడ్డట్టే ఉంటుంది. అదే భగవాన్ చెప్పారు కదా పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క అన్నారు. భగవాన్ ని చూడాలనే ఆత్రుతతో రంగన్ బండి ఆగకుండానే దిగిపోతాడు, అక్కడ బండి ఆగిన తరువాత దిగి రావచ్చు కదా, అప్పుడు రంగన్‌కి మోకాళ్లు అవి కొట్టుకుపోతాయి. ఆ రక్తం ఏమిటి? దెబ్బలు ఏమిటి? అంటారు భగవాన్. నువ్వు దొంగ వాడవు, నీ యందు నాకు ప్రేమ కలిగిస్తావు. తీరా ఇక్కడికి వచ్చాక సంబంధం లేనట్టు చూస్తావు. నువ్వు cruel లవర్‌వి అయ్యా, నువ్వు దుర్మార్గమైన ప్రేమికుడివి. మామూలు ప్రేమికుడివి కావు. లోపలేమో మంట పుట్టిస్తావు. ప్రేమ అనే అగ్ని హోత్రాన్ని పుట్టిస్తావు. తీరా నీ దగ్గరకు వచ్చి చూస్తే నీకు నాకు సంబంధం లేనట్టు ఎక్కడికో చూస్తావు. నా వంక చూడవు, ఎక్కడికో చూస్తావు. పోనీ ఈ మంట ఆపుతావా అంటే మంట ఆపవు. మంట ఎక్కడ ఆపుతాడు? పులి నోట్లో మనం చెయ్యి పెడితే వెనక్కి తీసుకోగలమా? అదే భగవాన్ చెప్పారు పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క అన్నారు. అప్పుడు రంగన్ నిన్ను చూడాలి అనే ఆత్రుత తోటి ఇలా వేగంగా దిగాను అంటాడు. చూడటం కంటే చూడాలని ఆత్రుత ఇంకా గొప్పది అన్నారు. నన్ను చూడటం కంటే ఇంకా చూడలేకపోయాను అనే ఆత్రుత ఇంతకంటే ఎక్కువ ఫలితం అన్నారు రమణ భగవాన్. నన్ను చూసిన దానికంటే, చూడలేక పోయాను భగవాన్ నిన్ను అని నీలో ఉండే తపన ఎక్కువ ఫలితాన్ని తీసుకు వస్తుంది. మనం ఏదో భక్తులం అని, సాధకులం అని అనుకుంటున్నాము. మన చేత సాధన చేయించే వాడు ఎవడు? ఈశ్వరుడే. ఈశ్వరుడి యొక్క ప్రేమ మన మీద లేకపోతే, ఈశ్వరుడి యొక్క కరుణ మన మీద లేకపోతే, ఈశ్వరుడు అసలు మనల్ని గుర్తిస్తాడా. ఇంక ఏమిటి మనం చేసేది. ఈశ్వర అనుగ్రహం వల్లే మనం ఈశ్వరుణ్ణి స్మరిస్తున్నాం. ఇందులో ఇంక మన అహంకారానికి తావు ఏది అసలు. ఈశ్వర అనుగ్రహం మన మీద లేకపోతే ఈశ్వరుడు గుర్తే రాడు అసలు మనకు. అందుచేత నిష్కామంగా ఈశ్వరుణ్ణి కనుక మనం ప్రేమిస్తే, నిష్కామంగా

కనుక భక్తి కలిగి ఉంటే, నిష్కామ కర్మ ఎంత ముఖ్యమో, నిష్కామ ప్రేమ, నిష్కామ భక్తి కూడా అంతే ముఖ్యం. అలా ప్రేమిస్తూ ఉంటే మన హృదయంలో మనకు తెలియనటువంటి ఒక తియ్యదనాన్ని, ఒక మాధుర్యాన్ని తీసుకువస్తాడు. మాధుర్యం అయిన మనుషులు ఎంతమంది ఉంటారు? అందరూ భగవంతుని కుటుంబ సభ్యులే. అందరూ భగవంతుని కుటుంబ సభ్యులే అనే భావన తోటి కనుక మనం పని చేస్తుంటే, మనకు తెలియకుండా మన హృదయంలో ఒక చక్కదనం, ఒక సొగసు, ఒక అందం, ఒక సౌందర్యం, ఒక తియ్యదనం, ఒక మాధుర్యం కలుగుతుంది. అపుడు ఏమవుతుంది అంటే అద్వైతసుఖం, అద్వైత అనుభవం మీ హృదయానికి అందుతుంది. మన హృదయంలోని వికారాలు అన్నీ రాలిపోతే, కాలిపోతే, మాడిపోతే, అప్పుడు మన హృదయానికి అద్వైత సుఖం, అద్వైత అనుభవం అందుతుంది. ఎప్పుడు? మన హృదయానికి తియ్యదనం వచ్చాక. దాని కోసమే ఈ ప్రార్థనలు, ఈ జపాలు, ఈ యోగాలు అన్నీ కూడా. ఒక తహసిల్దార్ గారి తల్లి భగవాన్ దగ్గరకు వచ్చింది. ఆయన, భగవాన్ చిన్నప్పుడు కలిసి చదువుకొన్నారు. తల్లి భగవాన్‌తో ఏమంది అంటే మా అబ్బాయి పెళ్లి చేసుకున్నాడు, సంసారం చేసుకొంటున్నాడు, తహసిల్దార్ ఉద్యోగం చేస్తున్నాడు. పది మందిలో గౌరవం సంపాదించాడు, పదిమంది హృదయాన్ని గెలుచుకుంటున్నాడు, తల్లితండ్రులకు గౌరవం తెస్తున్నాడు. నువ్వెందుకయ్యా? చదవటం మావాడితోటి చదువుకున్నావు, కాని ఎందుకు పనికి రాకుండా ఇలా అయిపోయావు. నీ తల్లి చేసిన పుణ్యం, నీ తండ్రి చేసిన పుణ్యం, నీ తాత చేసిన పుణ్యం ఇలా పరిణమించాయి, ఇలా గోచి పెట్టుకుని, రాళ్ల మీద కూర్చొని, ఎండకి ఎండిపోయి, వర్షానికి తడిచి, ఎందుకు పనికి రాకుండా, ఈ లోకానికి పనికి రాకుండా, పరలోకానికి పనికి రాకుండా ఇలా పాడై పోయావు. గోచి పెట్టుకుని రాళ్లలో కూర్చొని రాళ్లలో ఒక రాయిలా ఇలా అయిపోయావా? అని ఏడ్చి వెళ్లిపోయింది. ఆ తహసిల్దార్ తోటి భగవాన్ చెబుతున్నారు - మీ అమ్మ నన్ను చూడటానికి వచ్చింది, నా వాలకం చూసి, నా ఒంటి మీద ఉన్న బూడిద చూసి, మీ అమ్మ నన్ను చూసి ఏడ్చింది. నేనేమీ పలకలేదు, నేనేమీ మాట్లాడలేదు. మీ అమ్మ ఏడ్చింది, నా వాలకం చూసి ఏడ్చింది. నన్ను విడిచిపెట్టి వెళ్లిపోయింది. మళ్లీ నన్ను చూడటానికి మీ అమ్మ ఎప్పుడూ రాలేదు. బహుశా బైరాగి వాడిని ఇంకోసారి ఏమి చూస్తాను అనుకుందేమో మీ అమ్మ అన్నారు. అపుడు భగవాన్‌తో ఆ తహసిల్దార్ గారు ఏమన్నారు అంటే - తప్పంతా నీదే! మా అమ్మది ఏమీ తప్పు లేదు. తప్పంతా నీదే. సాక్షాత్తు నువ్వు ఈశ్వరుడివి అన్న సంగతి మా అమ్మకి తెలియనివ్వలేదు. నువ్వు తెలియనివ్వకపోతే మా అమ్మకి ఎలా తెలుస్తుంది అన్నాడు తహసిల్దార్. చాలులే అన్నారు భగవాన్. జ్ఞాన మార్గాన్ని ఉద్ధరించడం కోసం, మరుగున పడిపోయిన విచారణా మార్గాన్ని ఎత్తి చూపించడం కోసం, ఆ లోకంలో నుండి ఈ లోకంలోకి దిగి వచ్చిన ఈశ్వరుడే, భగవంతుడే భగవాన్ రమణమహర్షి.



# పరమేశ్వరి వైభవం

శక్తి స్వరూపిణి, జ్ఞాన స్వరూపిణి, దయాస్వరూపిణి అయిన పరమేశ్వరి వైభవం, విజయదశమి సందర్భంగా, మన నాన్నగారి మాటలలో......

**లక్ష్మి మహాలక్ష్మి, దుర్గా మహాదుర్గ, సరస్వతీ మహాసరస్వతి!**

**మహాలక్ష్మి మహాదుర్గ మహాసరస్వతి!**

ఇవి శరద్నవరాత్రులు, అంటే దేవి నవరాత్రులు. పరమేశ్వరుడిని, ఈశ్వరుడి గాను, ఈశ్వరి గానూ పూజిస్తారు. దేవీనవరాత్రుల సందర్భంలోపరమేశ్వరిని తొమ్మిది రోజులు ఆరాధిస్తారు. చివరిరోజు విజయదశమి. సర్వసాధారణంగా విజయదశమి రోజున ఏ పని ప్రారంభించినా అది శుభప్రదం అవుతుందని హిందువులు నమ్మకం.

పరమేశ్వరి జ్ఞానస్వరూపం. అంబికని ఆరాధిస్తే మనని జ్ఞానంతోటి అలంకరిస్తుంది. ఈశ్వరుడు శక్తి లేకుండా ఉండడు. ఈశ్వరుడు జ్ఞానం లేకుండా ఉండడు. ఆ జ్ఞానమే ఈశ్వరి, ఆ శక్తే ఈశ్వరి. రెండిటినీ విడదీయలేము. నిప్పుని వేడినీ విడదీయలేము, చంద్రుడిని చల్లదనాన్ని విడదీయలేము. మనం చంద్రుడి దగ్గరికి వెళ్లి విసనకర్ర వెయ్యక్కరలేదు, ఆయనే చల్లగా ఉంటాడు. అలాగే అమ్మవారిని ఆరాధిస్తే, అమ్మ వడిలో మనం చేరుకుంటే, అమ్మ పాదాలను ఆశ్రయిస్తే మనకి జ్ఞానం కలుగుతుంది. ఎందుచేతంటే ఆవిడ స్వరూపమే జ్ఞాన స్వరూపం.

నవరాత్రులలో మొదటి మూడు రోజులు దుర్గని, తరువాత మూడు రోజులలో లక్ష్మీదేవిని, చివరి మూడు రోజులు సరస్వతీదేవిని పూజిస్తారు. ఇది ఒక ప్లానింగ్. నవరాత్రులు అంటే, మనం పూజ చేసినా, జపం చేసినా, విచారణ చేసినా, ధ్యానం చేసినా, వీటన్నిటి లక్ష్యం, మన మనస్సుని నిగ్రహంలో ఉంచుకోవటం, మన బుద్ధిలో ఉన్న దోషాలని

తొలిగించుకొని, బుద్ధిని సంస్కరించుకోవటం. ఈ తొమ్మిది రోజులు మొదట దుర్గాదేవిని, తరువాత లక్ష్మీదేవిని, తరువాత సరస్వతీదేవిని పూజిస్తారు. దుర్గ అన్నా పరమాత్మే, లక్ష్మి అన్నా పరమాత్మే, సరస్వతి అన్నా పరమాత్మే. పరమాత్మకి పేర్లు ఇవన్నీ. అంతా పరమాత్మే!

మొదటి మూడు రోజులు మనం చెయ్యవలసింది ఏమిటంటే, మనం విచారణ చేసుకొని మన బుద్ధిలో ఏమైనా దోషాలు ఉన్నాయేమో చూసుకోవాలి. ఏకాంతంగా కూర్చొని ఆ మూడు రోజులూ మన బుద్ధిలో ఏమైనా దోషాలు ఉన్నాయేమో జాగ్రత్తగాచూసుకోవాలి. చూసుకొని ఉంటే, తొలిగించుకోవటానికిప్రయత్నం చెయ్యాలి.

ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి, ఎదుటివాళ్ళుఎవరైనా మిమ్మల్నిపొగిడినా విమర్శించినా మీరుపట్టించుకోకండి. ఎవరైనాఅమ్మగారు మిమ్మల్ని పొగిడితే పొంగిపోవద్దు, విమర్శిస్తే కుంగిపోవద్దు. ఆ పొగడ్తా నిజం కాదు, విమర్శలూనిజం కాదు. అసలు ఆ అమ్మగారే నిజం కాదు! రూపము నామము గుణము కర్మ, ఇవినాలుగు మన మనస్సు కల్పించిన గొడవలు. అసలు వస్తువు, సద్వస్తువు, బ్రహ్మము చావు ఎలా ఉంటుందో పుట్టుక ఎలా ఉంటుందో తెలియనటువంటి స్వయంప్రకాశమైన వస్తువు, అది ఈ నాలుగింటికీ అతీతంగా ఉంది. మీకు తెలియక అవి నాలుగు నిజం అని అనుకోవటం వల్ల మీరు కంగారు పడతారు, దాని ప్రభావం నీ మనస్సు మీద పడుతోంది.

ఇంకొక విషయం; మనమందరం శారీరక ఆరోగ్యానికి ప్రాముఖ్యత ఇస్తున్నాము కాని మానసిక ఆరోగ్యానికి ప్రాముఖ్యత ఇవ్వటం లేదు. శరీరం ఎంత ఆరోగ్యంగా ఉండాలని మనం అనుకొంటున్నామో, మన మనస్సు కూడా అంత ఆరోగ్యంగా ఉండాలి. కాని మన మనస్సుని కూడా ఆరోగ్యంగా పెట్టుకోవాలనే భావన మనకు లేదు. స్మశానంలో మన శరీరం కాలిపోయిన తరువాత,మనకీ శరీరానికి ఉన్న సంబంధం తెగిపోతుంది. కాని మనస్సు మన కూడా వస్తుంది. మన కూడా వచ్చే మనస్సు యొక్క ఆరోగ్యం విషయం మనం పట్టించుకోవటం లేదు. అదే ఈ దేవీ నవరాత్రులు చెప్పేది. మన శరీరానికి ఏదైనా రోగం ఉందని డాక్టరు దగ్గరికి వెళ్తే, వాళ్ళకి అర్థం కాకపోతే శరీరంలో ఏ రోగం ఉందో తెలుసుకోవడానికి ఎక్స్‌రే తీస్తారు, స్కానింగ్ చేస్తారు. అలాగే నవరాత్రులలో మొదటి మూడు రోజులు మన బుద్ధిలో దోషాలు ఎలా ఉన్నాయో మనమే విచారణ చేసి తెలుసుకోవాలి. తెలుసుకొని ఒకవేళ దోషాలు ఉంటే వాటిని తొలిగించుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి.

తరువాత మూడు రోజులు లక్ష్మీదేవి. లక్ష్మి అంటే కళ్యాణగుణాలు. లక్ష్మి అంటే కేవలం కాగితం ముక్కలే కాదు. కొబ్బరిచెట్టు బాగాకాసింది అనుకోండి, అది లక్ష్మి. మీ

ఇంటిలో అందరూ ఐక్యమత్యంగా ఉంటున్నారు అనుకోండి, అది లక్ష్మి. మీ ఇంటిలో పేచీలు పెట్టేవారు ఎవరూ లేరనుకోండి, అది లక్ష్మి. ఐకమత్యమే లక్ష్మి. సమిష్టిగా ఉండటమే లక్ష్మి. ఒకళ్ళని ఒకళ్ళు అర్థం చేసుకోవటమే లక్ష్మి. లక్ష్మి అంటే కళ్యాణ గుణాలు. ఈ మూడు రోజులు ఏమి చెయ్యాలంటే, మన బుద్ధిలో ఏమైనా దోషాలు ఉంటే తొలగించుకొన్న తరువాత మళ్ళీ మంచి గుణాలతోటి బుద్ధిని నింపుకోవాలి. మనకి కురుపువేస్తే-చీము పిండేసి వదిలేయరు, పైన కట్టు కడతారు. అదేవిధంగా చెడ్డగుణాలు తొలగించేసుకుంటే సరిపోదు. ఈ గోడకి చెడ్డగుణాలు ఏమీ లేవు, అలాగని దానిని జ్ఞాని అనరు. చెడ్డగుణాలు తొలగించుకొని మంచి గుణాలతోటి బుద్ధిని నింపాలి. నింపినతరువాత ఏమి చెయ్యాలి?

చివరి మూడు రోజులు సరస్వతి. సరస్వతి అంటే ఆత్మజ్ఞానం, ఆత్మశాంతి. అదే సౌభాగ్యం! ఆత్మజ్ఞానానికి మించిన సౌభాగ్యం లేదు. అది చివరి మెట్టు. మంచి గుణాలను అలవర్చుకున్న తరువాత ఈ కళ్యాణగుణాలను సపోర్ట్‌గా తీసుకొని ఆత్మజ్ఞానం పొందాలి. గుణం జ్ఞానం కాదు. అయితే మంచిగుణాలు ఎందుకు ఏర్పాటుచేసుకోవాలి అంటే, మంచి గుణాలు మనకి ఆత్మజ్ఞానాన్ని సంపాదించి పెడతాయి. చివరి మూడు రోజులు ఆత్మజ్ఞాన సముపార్జనకి, ఆత్మవిద్యని సంపాదించుకోవటానికి ప్రయత్నంచెయ్యాలి, కష్టపడి కృషి చెయ్యాలి. బుద్ధిని దానికి ప్రిపేర్ చెయ్యాలి. అంటే బుద్ధిని సమాయత్తం చెయ్యాలి. ఏదైనా ఊరికి వెళ్తే ఒకరోజు ముందు ఎలా సద్దుకుంటామో, అలాగే జ్ఞానసముపార్జనకి బుద్ధిని సిద్ధం చెయ్యాలి. అవే నవరాత్రులు.

ఏ రూపమూ నిజం కాదు, ఏ నామమూ నిజం కాదు. అందుచేత మీరు బయట విషయాలని చూసి, బాహ్యవిషయాలని చూసి భయపడకండి. మీ మనస్సుకి అంతర్ దృష్టి, లోచూపు కలుగుతా ఉంటే, ఎక్కడైతే భగవంతుడు అంతర్యామిగా ఉన్నాడో, ఈశ్వరుడు అంతర్యామిగా ఉన్న వైపుకి మనస్సు మళ్ళుతా ఉంటే, మీ భయాలకి అర్థం లేదని మీ అంతట మీకు తెలుస్తుంది.

అమ్మవారి అనుగ్రహం లేకుండా ఇటువంటి బలహీనతల లోనుంచి బయటికి రావటం కష్టం. నీటిలో వల వేస్తే అందులో చాలా నీరు ఉన్నట్టు ఉంటుంది, కాని మళ్ళీ వల పైకి లాగేస్తే అందులో ఒక్క నీటిచుక్క కూడా ఉండదు. అలాగే మీరు ఎన్ని ధ్యానాలు చేసినా ఎన్ని సాధనలు చేసినా, అమ్మవారి అనుగ్రహం లేకపోతే వలలో నీటిలాగే ఉంటుంది. అమ్మవారి దయ ఉండాలి. అంబిక కటాక్షం ఉంటే మనకి అన్నీ ఉన్నట్టే. భగవంతుడి దయ అనుగ్రహం ఉంటే, మనకి అన్నీ ఉన్నట్టే!



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

**యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మాజితేంద్రియః ।**
**సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥ 5-7॥**

తాత్పర్యము : మనస్సును వశమునందు ఉంచుకొనిన వాడు, జితేంద్రియుడు, అంతఃకరణ శుద్ధి కలవాడు,సర్వప్రాణులలో ఆత్మస్వరూపుడైన పరమాత్మను తన ఆత్మగా కలవాడు అగు కర్మయోగి కర్మలను ఆచరించుచున్నను ఆ కర్మలు వానిని అంటవు.

యోగయుక్తో - కర్మని యోగంగా చేసేవాడు యోగ యుక్తుడు. అంటే కర్త కనబడకూడదు, కర్మ కనిపిస్తూ ఉంటుంది. పని కనిపిస్తూ ఉండాలి, ఆ చేసేవాడికి నేను చేస్తున్నాను అనే భావన రాకూడదు. వ్యక్తి భావన లేకుండా, అహంభావన లేకుండా పని చేసే వాడిని యోగయుక్తుడు అంటారు. నేను చేస్తున్నాను అనే భావనతో కనుక పని చేస్తే, అది మంచి ఫలితమైనా చెడ్డ ఫలితమైనా,మరో దేహంలోఅయినా మరో జన్మలో అయినా, ఈ కర్మ వాడిని వెంటాడుతూ ఉంటుంది. అలాగే కర్తృత్వం లేకుండా పని చేస్తే, వాడికి శాంతి కలుగుతుంది, సుఖం కలుగుతుంది. వాడు బ్రాహ్మీస్థితి పొందటానికి ఆ నిష్కామ కర్మ సహకరిస్తుంది. మీకూ నాకూ మనందరికీ సపోర్టుగా ఉన్న దానిని బ్రహ్మం అంటారు. దానినే బైబిలులో ఉండటము అంటారు. "ఐ యాం దట్ ఐ యాం" అని సత్యపదార్థం గురించి బైబిలులో నిర్వచనం చెపుతారు. బ్రహం అంతటా ఉంది, మన హృదయంలోనూ ఉంది. ఆబ్రాహ్మీస్థితిని అందుకోవటానికే, ఈ ప్రవచనాలు, యజ్ఞాలు, యాగాలు, పుణ్యాలు, ఈ జపాలు తపాలు అన్నీ కూడా. సాధన పేరు మీద మనం ఏది చేసినా, ఆ బ్రాహ్మీ స్థితిని అందుకోవటానికి మనం చేస్తున్న పని అనుకూలంగా ఉండాలి. అదే కర్మయోగం. కర్మని యోగంగా చేస్తే, పని నిన్ను బంధించదు, వాసనలలోనుంచి విడుదల చేస్తుంది. కర్మయోగం

వలన కూడా జ్ఞానం సంపాదించవచ్చు. బుద్ధిమంతుడు తెరమీద కనబడడు, వాడి పని కనిపిస్తూ ఉంటుంది.

ఆహారం, మాట నియమంగా ఉండాలి, అతి నిద్ర పనికి రాదు, వ్యవహారం కూడా తగుమాత్రంగా ఉండాలి. ఈ నియమాలన్నీ బ్రాహ్మీస్థితి పొందటానికి సహకరిస్తాయి. మన చేతిలో మనస్సు ఉండాలి కాని మనస్సు చేతిలో మనం ఉండకూడదు. మన చేతిలో మనస్సు ఉంటే, అది మన మిత్రుడిగా పనిచేస్తుంది. అప్పుడు బాహ్యంగా మనకి ఎంతమంది శత్రువులు ఉన్నా వాళ్ళు మనని ఏమీ చెయ్యలేరు. మనస్సు చేతిలో మనం ఉంటే, ఆ మనస్సే మనకి శత్రువుగా పని చేస్తుంది. అప్పుడు బాహ్యంగా ఎంతమంది మనకి సహకరించినా, మన అభివృద్ధికి ప్రయత్నించినా ప్రయోజనం కనపడదు. మనస్సుని నీ బంధువుగా, నీకు అనుకూలంగా చేసుకుంటే, నీ ఆధ్యాత్మిక అభివృద్ధికి భౌతిక అభివృద్ధికి కూడా ఉపయోగపడుతుంది. మనోనిగ్రహంఉన్న వాడికే ఇహపరాలు ఉంటాయి.

విశుద్ధాత్మా అంటే పవిత్రమైన హృదయం కలవాడు. నిన్ను నువ్వు పవిత్రం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీ బుద్ధిని శుద్ధి చేసుకో. యోగానికి నీ శరీరం మనస్సు ఆరోగ్యంగా ఉండాలి. రోజూ ఒక అరగంటో గంటో ఏకాంతంగా ఉంటే, మీలో లోపాలు మీకు తెలుస్తూ ఉంటాయి. ఏకాంతవాసమూ,పనీ, రెండూ కూడా స్కానింగ్ లాంటివే. మీరు అహంకారాన్ని గ్లోరిఫై చేసుకొంటున్నారా, భగవంతుడి ప్రీతికోసం పని చేస్తున్నారా తెలిసిపోతుంది. భగవంతుడి ప్రీతికోసం పని చేస్తూ ఉంటే, మనస్సు పవిత్రం అవుతుంది. మీ మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు, మీ హృదయంలో ఏమి ఉందో ప్రతిబింబిస్తూ ఉంటుంది. మీ మనస్సు ప్రశాంతంగా ఉంటే, ఇంద్రియాలు కుదురుగా ఉంటే, బుద్ధి ఉద్రేకం లేకుండా ఉంటే, మీ లోపల అనుగ్రహం ఉందని తెలుస్తుంది. కష్టాలు కూడా మనలో పరివర్తన తీసుకురావటానికే వచ్చాయి, మమకారంతగ్గించటానికే వచ్చాయి అని తెలుస్తుంది. మనం బంధంలో ఉన్నాము. బంధరహిత స్థితికి తీసుకువెళ్ళటానికి ఈశ్వరుడు ఒక్కడే ఆధారం. అందుచేత పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఈశ్వరుడి పాదాలు విడిచిపెట్టకు. శ్వాస పోయేవరకూ విశ్వాసం విడిచిపెట్టకు.

యోగయుక్తో విశుద్ధాత్మా - హృదయశుద్ధి కలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు. మాట ఆలోచన చేత ఒకటిగా ఉన్నవారికి హృదయశుద్ధి కలుగుతుంది. హృదయశుద్ధి లేనివారు బ్రాహ్మీ స్థితి పొందలేరు. హృదయశుద్ధి కలగాలంటే సత్వగుణం సంపాదించాలి. మనంమూడు గుణాలతో ఉన్నాము రజో, తమో, సత్వగుణాలలో తిరుగుతున్నాము, భగవంతుడుగుణాతీతుడు,గుణాలు లేకుండా ఉన్నాడు. అందుచేత నేను మీకు అర్థం కాను అన్నాడు. గుణాలలో ఉన్నవాడికి గుణాతీతుడు అర్థం కాడు. భగవంతుడు

మనస్సు, ఇంద్రియాలు, బుద్ధి చేత గ్రహింపబడే వాడు కాదు. భగవంతుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉండి, వారి ప్రారభ్దాన్ని బట్టి ఆ దేహాలను ఆడిస్తున్నాడు. ఈ శరీరాలు కేవలం బొమ్మలు.

ఈశ్వరుడు అంతర్యామిగా ఉన్నాడు, అయితే చిత్తశుద్ది లేకుండా మనస్సు అంతర్ముఖం అవ్వదు. మనస్సు అంతర్ముఖం అవ్వకుండా అది ఆత్మాకారం చెందదు. ఆత్మాకారం చెందకుండా ఆత్మానుభవం కానీ ఆత్మజ్ఞానం కానీ రాదు. ఆత్మజ్ఞానంఅన్నా మోక్షం, నిర్వాణ స్థితి, స్వర్గరాజ్యం అన్నా ఒక్కటే. ఇవి అహంభావన లేనివాడికి మాత్రమే అందుతాయి. అహంభావన అంటే కోపం కాదు, దేహాత్మ బుద్ధి. మనం ఏదైతే కాదో దానితోటి తాదాప్యం పొందుతున్నాము. కాని దాంట్లోంచి విడుదల అవ్వకుండా, ఉన్నదేంటో, ఉన్నది ఉన్నట్లు, మనకి వ్యక్తం కాదు. ఆ ఉన్నదేదో మనకి అనుభవైకవేద్యం కాకుండా, మనకి సుఖం కాని, శాంతి కాని, ఆనందం కాని తెలియదు.

హృదయశుద్ధి లేకపోతే సంపాదించుకోవాలి. మనం ఏ పని చేసినా, ఆ పని ద్వారా మనం హృదయ శుద్ధి పొందుతున్నామా లేదా, ఇది మన ప్యూరిఫికేషన్ కి ఎంతవరకూ ఉపయోగపడుతుంది అని చూసుకోవాలి. మనస్సు అణిగిన చోట సత్యం తెలియబడుతుంది కాని, మనస్సుచేత గ్రహింపబడేది కాదు. భగవద్గీతలో మనోనాశనానికి అనేక ఉపాయాలు చెప్పారు. దైనందిన జీవితంలో మన జీవనవిధానం ఎలా ఉండాలో భగవద్గీతలో బాగా వివరించారు.

విజితాత్మా జితేంద్రియః - మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం లేకుండా, ఇహం కాని పరం కాని, ఏ అభివృద్ధి నువ్వు పొందలేవు. మనస్సు ఇంద్రియాలు నియమించుకోవాలి. మన మనస్సు ఏ విషయాల గురించి బయటికి వెళ్తోందో చూసుకోవాలి. ఎందుకు బాహ్యముఖం అవుతోందో పరిశీలించుకొని ఆ వాసనని కట్ చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి. మనకి రాగద్వేషాలు లేకపోతే మనస్సుని కదలమన్నా కదలదు. ఇష్టా అయిష్టాలు ఉంటే, మనస్సు అలా చెలిస్తూనే ఉంటుంది. ఇష్టం అయిష్టం రెండూ బందిస్తాయి. వాటిలోంచి నువ్వు విడుదల పొందలేకపోతే కల్మషం లోంచి కూడా బయటికిరాలేవుఅన్నారు భగవద్గీతలో.

నియమములన్నింటి లోకి ఆహారనియమము ముఖ్యమైనది. చాన్డోకోపనిషత్తులో ఆహార శుద్ధి గురించి వివరంగా చెప్పారు. ఆహారంలోంచే శరీరము మనస్సు తయారు అవుతాయి. ఆహారం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే, మనస్సు ఇంద్రియాలు స్వాధీనం లోకి వస్తాయి.

జితేంద్రియః - ఎటు చూసినా ఒకే ఆత్మని చూడాలి. ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. మీ

హృదయంలో ఉన్నది నా హృదయంలో ఉన్నది ఒక్కటే. శరీరాలు, మనస్సు ప్రవృత్తి వేరుగా ఉంటాయి, కాని హృదయంలో ఉన్న బ్రహ్మపదార్థం ఒక్కటే. మనం ఎవరికో ఏదో ఇచ్చాము అనుకుంటాము, కాని అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడే స్వీకరిస్తున్నాడు. రమణ మహర్షి గారు అన్నారు, నువ్వు ఎవరికీ ఏది ఇచ్చినా అది తిరిగి నీకే వచ్చేస్తుంది అని నీకు తెలిస్తే, నువ్వు ఇతరులకి ఇవ్వకుండా ఎలా ఉండగలవు! నువ్వు మంచి చేసినా చెడ్డ చేసినా లోపల ఈశ్వరుడికే అందుతుంది, ఏది చేసినా ఎత్తుకి ఎత్తు భవిష్యత్తు లో నీకు అనుభవం లోకి వస్తుంది. నేను చేస్తున్నాను అనే భావనతో పని చేస్తే, నువ్వు ఏ జన్మలో ఏ లోకంలో ఉన్నా ఆ కర్మ నిన్ను వెంటాడుతూ ఉంటుంది. నేను చేస్తున్నాను అనే తలంపు లేకుండా చేస్తే రెండు లాభాలు, ఫలితమూ వస్తుంది, మనస్సుని శుద్ధి చేస్తుంది, ఈశ్వరానుభవం పొందటానికి నిన్ను ప్రిపేర్ చేస్తుంది. స్వార్థంతో చేసిన పని దేహభావన పెంచుతుంది,స్వార్థం లేకుండా పని చేస్తే దేహభావన నుంచి విడుదల చేస్తుంది.

విజితాత్మాజితేంద్రియ - ఇక్కడ ఆత్మ అంటే, భగవంతుడు మనస్సుని ఆత్మగా చాలా సార్లు ఉపయోగించాడు. ఆత్మ అంటే ఇక్కడ పరమాత్మ కాదు, మనస్సే. మనస్సుని నువ్వు ఎందుకు నియమించుకోవాలి అంటే, అన్నివిధములా ప్రయత్నం చేసి మనస్సుని ఎందుకు జయించాలి అంటే బ్రాహ్మీస్థితిని పొందటానికి. అది నీ గోల్ అని మరిచిపోకూడదు. ఒక్క బ్రహ్మములోనే సుఖము శాంతి ఆనందము ఉంది. అది మన అనుభవంలో లేకపోయినా స్ఫురిస్తూ ఉంటుంది.


ఆత్మస్తుతి పరనింద, ఇవి రెండూ పెద్ద రోగాలు. ఇతరుల లోపాల గురించి మాట్లాడి మీ టైము ఎనర్జీ పాడుచేసుకునే బదులు, మీలో లోపాలు ఉంటే వెదుక్కుని, వాటిని బయటికి లాగి తగలుబెట్టుకోండి అన్నారు షిరిడీ సాయిబాబా. ఇతరులని విమర్శించటం వలన మీకేమీ కలిసిరాదు, పైగా పాపం వస్తుంది, వాళ్ళు చేసిన దోషాలు మీకు అంటుకుంటాయి. ఆ ఫలితం మీరు అనుభవించవలసి వస్తుంది. అందుచేత సాధకుడు, ఆత్మస్తుతి పరనింద, ఇవి రెండూ విడిచిపెట్టటానికి ప్రయత్నం చేయాలి.

సర్వభూతాత్మ భూతాత్మా - ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. అది లేని చోటు అంటూ లేదు. అది అంతటా ఉంది, మన హృదయంలో కూడా ఉంది. అది సాక్షిగా ఉంది, అంతర్యామిగా ఉంది. మనకిమంచి తలంపులు చెడ్డ తలంపులు ఏవో వస్తూ ఉంటాయి. ఏదో వస్తున్నాయి అని మనం వాటిని పట్టించుకోము. ఒక్క చెడ్డ తలంపు వస్తే, దానికిఈ జన్మలోనో మరో జన్మలోనో ఏదో ఒక రోజున భగవంతుడికి సమాధానం చెప్పాలి. మనం చేత్తోటి చేసే పనికే కాదు, నోటితోటి మాట్లాడే మాటకే కాదు, మనకి ఏ తలంపు వచ్చినా, ఆ తలంపుకి భగవంతుడు సాక్షిగా ఉన్నాడు.

భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడనే విశ్వాసం కనుక ఉంటే, ఆయన పాదాల యందు మనకి భక్తి కలిగి ఉంటే, నూటికి 80 వంతులు మనస్సు నాశనం అయిపోతుంది. అయితే మన విశ్వాసం అంత లోతుగా లేదు, అంతా ఈశ్వర సంకల్పం తోటే నడుస్తోంది అనే భావన మనకు లేదు. మనం సుఖంగా ఉన్నప్పుడు దేవుడు గుర్తు రాడు, దుఃఖంగా ఉన్నప్పుడే గుర్తుకి వస్తాడు.

మహాత్ముల యొక్క సమక్షంలో, వారి సాంగత్యం వలన, ఆ వస్తువు తాలూకు అనుభవం మనకు లేకపోయినా హృదయంలో ఏదో ఉందని స్ఫురిస్తుంది. అక్కడి నుండి దానికోసం ప్రయత్నం ప్రారంభమవుతుంది. మహాత్ముల దర్శనం వల్ల భౌతికంగా అయినా, ఆధ్యాత్మికంగా అయినా, ఏదో ఒక లాభం పొందకుండా జీవుడు బయటికి వెళ్ళడు. అయితే ఎప్పుడైనా సత్యవస్తువు లోపల ఉన్నట్టు స్ఫురించినా అది నిలబడదు అన్నారు రమణమహర్షి. లోపల వాసన ఉన్నంతకాలం ఆ వస్తువుని నీకు అనుభవంలో ఉండనివ్వదు. మనం ఫలకాంక్షతో పని చేసి, ఫలితాన్ని ఎంజాయ్ చేసినప్పుడు వచ్చే భావన వాసన కింద ఉండిపోతుంది. వాసన లేకుండా తలంపు రాదు. వాసన లోంచి తలంపు, తలంపు లోంచి మాట వస్తాయి, తలంపులోంచి పనిచేస్తాము. సంసారం అంటే ఇదే. మనం తిన్న తిండిని బట్టి తేన్పు వస్తుంది; అలాగే చేసిన పనిని బట్టి వాసన వస్తుంది. వాసనాక్షయం అయ్యేవరకూ నువ్వు పొందిన అనుభవం పెర్మనెంట్ అవ్వదు. వస్తువు స్ఫురిస్తూ ఉండవచ్చు, కాని నువ్వు పతనం అయ్యే అవకాశం ఉంది, ఆ వాసన నీకు కలిగిన జ్ఞానానుభవాన్ని డిస్టర్బ్ చేస్తుంది, స్థిరంగా ఉండనివ్వదు. కానీ ఒకసారి అనుభవం పొందారు కాబట్టి మనం ఎక్కడ పతనం అవుతున్నామో తెలుస్తూ ఉంటుంది. మళ్ళీ వాసనని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేస్తారు. వాసన లోంచి తలంపు, తలంపు లోంచి అలవాట్లు వస్తాయి. అలవాట్ల యొక్క వేగం చాలా తీవ్రంగా ఉంటుంది. డబ్బు, చదువు అధికారం, వీటితో తాదాప్యం పొందకూడదు, వీటివల్ల అహంకారం పెరగకుండా చూసుకోవాలి. లోకంలో ఉన్న ఐశ్వర్యం అంతా ఈశ్వరుడిది; ఆయన సంకల్పం లేకుండా ఏదీ మనకి రాదు. భగవంతుడు ఇచ్చిన అవకాశాలని సద్వినియోగం చేసుకుంటే, నీకు పుణ్యం తెచ్చిపెడతాయి. నువ్వు చేసిన పుణ్యం నీకు జ్ఞానానికి పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. మంచి పనుల వల్ల చిత్తశుద్ధి కలుగుతుంది; చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే మనం మోక్షానికి వెళ్ళాలి కాని ఇంకో మార్గం లేదు.

నీకు సహృదయం ఉంటే, కర్తృత్వ బుద్ధి లేకపోతే, కర్తలేని కర్మ చేస్తుంటే, వాడు బుద్ధిమంతుడు. మనిషికి నేను చేస్తున్నాను అనే తలంపు వల్ల దుఖం వస్తుంది. కర్తృత్వం లేకుండాపనిచేస్తే నీకు దుఃఖస్పర్శ కూడా రాదు. అహంభావన లేకుండా పని చేస్తే అది నిన్ను బంధించదు. మనకి వచ్చే భావన వెనుక అహంభావన ఉంటే మనం పతనం అవుతాము.




**కుక్కకు న్నీచమే నేనే గురుతు కొని**
**వెదకి నిన్చేరుదు అరుణాచలా!**

తాత్పర్యం: నేను కుక్క కంటే హీనుడను అనుకొంటున్నావా అరుణాచలా! అడుగు జాడల వాసనను బట్టి కుక్క తన యజమానిని చేరుకున్నట్లు, నేను నిన్నే లక్ష్యంగా పెట్టుకొని, శోధించి, నిన్ను చేరుకుంటాను అరుణాచలా!

ఓ అరుణాచలేశ్వరుడా, కుక్కకంటే చెడిపోయానా నేను! కుక్క తన యజమాని నుంచి దూరం అయిపోతే, తన యజమాని ఎక్కడ ఉన్నాడో తెలుసుకోవటం కోసం, తన యజమాని అడుగులు ఎక్కడ వేసాడో వాసన చూస్తూ, అది నెమ్మదిగా యజమానిని చేరుకొంటుంది. నువ్వు నా యజమానివి, అంటే పరమాత్మ అరుణాచలేశ్వరుడు. నేను నా యజమానివైన నువ్వుఎక్కడ ఉన్నావో నేను తెలుసుకొని, నీ కోసం వెదికి, నీకోసం అన్వేషించి నిన్ను చేరుకుంటాను. ఓ అరుణాచలేశ్వరుడా, నువ్వు నా హృదయంలోనే ఉన్నావు; ఆత్మగా ఉన్నావు.

ఈ నేను నేను అనే భావన నా హృదయంలోంచివస్తోంది. మీరు ఒక్కసారి ఆలోచించండి. మనమందరమూనేను నేను అంటాము. దేవుడు లేడు అనేవాళ్ళు చాలా మంది ఉన్నారు. కాని నేను లేను అనేవారు ఎవరైనా ఉన్నారా?దేవుడు లేడు అంటేఎవరికీ కోపం రాదు. నువ్వు లేవు అంటే వాడికి కోపం వస్తుంది. త్రాచుపాము పడగ విప్పినట్టు విప్పుతాడు, నేను లేను అంటావా, నేను లేనా అని! మనం నేను నేను అంటున్నాము. ఈ నేను అనే తలంపు ఎక్కడినుంచి వస్తోంది? బయటి నుంచి వస్తోందా, లోపలినుంచి వస్తోందా? అది లోపలినుంచే వస్తోంది. ఈ నేను ఎక్కడినుంచి వస్తోందో చూడు. అది పుట్టిన చోటు చూసేవరకూ మనల్ని అహంకారం విడిచిపెట్టదు. ఈ శవాలను మోయటం, పునర్జన్మలు తప్పవు, రోగాలు తప్పవు, అశాంతి, దుఃఖం తప్పవు, వేదన రోదన తప్పవు. ఎప్పటివరకూ అంటే నేను యొక్క సోర్స్ నీకు తెలిసేవరకూ. నేను నేను అని అంటున్నావు.

ఈ నేను యొక్క సోర్స్ కాశిలో లేదు, రామేశ్వరంలో లేదు, అమెరికాలో లేదు, ఇంగ్లాండ్లో లేదు. అది నీలోనే ఉంది. నీలో ఉన్న సోర్స్ నీకు తెలిసే వరకూ నువ్వు ఈ చిక్కులలో నుంచి బయట పడలేవు, అశాంతిలోనుంచి బయట పడలేవు.

ఆ సోర్సుని తెలుసుకో, ఆ సోర్సేనీ యజమాని, ఆ సోర్సే దేవుడు, ఆ సోర్సే మోక్షం, ఆ సోర్సే నిర్వాణం. ఆ సోర్సే పర్ఫెక్షన్, ఆ సోర్సే పీస్, ఆ సోర్సే ఎటర్నల్హేట్. నువ్వు ఏదైతే నేను నేను అని అంటున్నావో, దాని పుట్టు చోటుకి నువ్వు వెళ్ళగలిగితే నీ సోర్స్ బట్టబయలు అవుతుంది. నీ సోర్స్ వ్యక్తమయ్యి, ఇప్పుడు నువ్వు అనుకొనే దేహానికి పరిమితమయిన నేను, మనస్సుకిఅహంకారానికి పరిమితమయిన నేను, ఇంద్రియాలకి లోకానికి పరిమితమయిన నేను, స్త్రీ పురుషుడు అనే ఒక లింగ బేధానికి పరిమితమయిన నేను, అణిగిపోయి, అప్పుడు ఇంకొక నేను వస్తుంది. ఆ నేను దేహానికి పరిమితం కాదు, పుట్టుకకి-చావుకి పరిమితమయినది కాదు, లేకపోతే ఒక కులానికో దేశానికో పరిమితమయినది కాదు. అది అనంతమైనది. దానిని విడదీయలేము. అది ఖండమైనది కాదు, అది అఖండమైన నేను. ఇప్పడు మనం నేను, నేను అనేది ఖండమైన నేను అది అఖండమైన నేను. ఆ నేను లేకుండా ఈ నేను ఉండలేదు, ఈ నేను లేకుండా ఆ నేను ఉండగలదు. మనము అనుకునే నేను నిజమైన నేను కాదు కాబట్టే, నేను ఎవడనో తెలుసుకోమన్నాడు. ఇదే హేతువాదం, ఇంతకంటే హేతువాదం ఇంకేమి కావాలి మీకు!

మనకి కావలసినది ఆత్మానందం కాదు, ఆర్థికానందం కావాలి. మనుషులకి ఆత్మానందం కాదు, ఆర్థికానందం కావాలి. ఆర్థికానందం కోసం నువ్వు చేస్తున్న కృషే ఆత్మానందం కోసం చేస్తే, ఆత్మ నీకువ్యక్తమవుతుంది. అనిర్వచనీయమైన సుఖాన్ని, అఖండమైన శాంతిని నువ్వు పొందాలంటే, తప్పనిసరిగా నీ హృదయములో ఉన్నటువంటి నీ మైండ్ యొక్క సోర్సుని నువ్వు తెలుసుకో. మనస్సుని తెలుసుకుంటే అంటే మనోమూలాన్ని తెలుసుకుంటే మనస్సు ఉండదు. అందుచేత మనస్సుని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయటానికి మనస్సు ఇష్టపడదు. నువ్వు అన్నీ తెలుసుకో, లోకంలో అనేక విషయాలు, అనేక సబ్జెక్టులు, అనేకబ్రాంచిలు ఉన్నాయి, నువ్వు అన్నీ తెలుసుకో, కాని నా దగ్గరకు మట్టుకు రాకు అంటుంది. ఎంచేతంటే, దాన్ని తెలుసుకుంటే, అది ఉండదు.

నేను గొప్ప గొప్ప విషయాలు ఆలోచిస్తున్నాను అని ప్రతి మనిషి అనుకోవచ్చు, అసలు ఆలోచించేవాడు ఎవడు?నేను జపం చేస్తున్నాను అంటున్నారు, లోపలఉండి ఆ జపం చేసే జపి ఎవరు? ఈ నేను అనే తలంపు వచ్చాకే మిగతా తలంపులు అన్నీ వస్తున్నాయి అని

చెపుతున్నారు రమణ మహర్షి. ఆ నేను అనే తలంపు కూడా లోపలికి వెళ్ళి, ఆ నేను అనే తలంపు ఎక్కడ పుడుతోందో, దాని పుట్టుక చోటు వెదుకు.

తన యజమాని నుంచి దూరం అయిపోయిన కుక్క, ఏ విధంగా అయితే యజమానిని చేరుకోవటానికి వాసనని బట్టి వెళుతుందో, అదేవిధంగా ఈ నేను అనే తలంపుని నువ్వు పట్టుకొని, నీ మనస్సుని అంతర్ముఖం చేసి, నేను ఎవడు అనే విచారణ చేసి, నువ్వు ఆత్మని తెలుసుకో.

కుక్కకున్నీచమే - రమణ మహర్షి గారి ఉద్దేశం ఏమిటంటే, కుక్క కంటే తక్కువ వాడిని అని అనటం లేదు ఆయన. కుక్క చేసే పని నేను చెయ్యలేనా అంటే, చెయ్యలేకపోతే నేను తక్కువ అని అర్థం. కుక్క తన యజమాని ఎక్కడ ఉన్నాడో గుర్తుపడుతుంది. వాసన చూస్తూ యజమాని దగ్గరికి వెళ్ళిపోయి చేరుకుంటుంది. నా యజమాని అయినటువంటి, నా స్వామి అయినటువంటి, నా పతి, గతి, దైవం అయినటువంటి అరుణాచలేశ్వరుడిని నేను వెతుక్కొంటూ వెళ్ళి చేరలేనా, కుక్క చేసే పని నేను చెయ్యలేనా అంటున్నారు!

వెతకండి, అది తప్పనిసరిగా దొరుకుతుంది. మీరు అన్వేషణ చెయ్యండి. తలుపు కొడితే, తలుపు తీయబడుతుంది. మనంఅన్వేషణ మొదలుపెడితే, సాధన ప్రారంభిస్తే, తెలుసుకోవాలనే కాంక్ష, ఆ జిజ్ఞాస, ఏ మనిషిలో అయితే ఉందో, తప్పని సరిగా వాడికి తెలియబడుతుంది. ఏ విద్య అయినా మనకి రావాలంటే తెలుసుకోవాలనే కాంక్ష ఉండాలి, అదే కృష్ణుడు శ్రద్ధ అని చెప్పాడు. నువ్వు గనుక అన్వేషణ చేస్తుంటే, తప్పనిసరిగా గమ్యానికి చేరుకుంటావు. నువ్వు అడుగులు లెక్క పెట్టుకోనక్కరలేదు. నువ్వు అడుగులు లెక్క పెట్టుకోక పోయినా, పక్కవాడితోటి కబుర్లు చెపుతూ నడుస్తున్నప్పటికీ, అసలు నడక సాగిస్తే, గమ్యానికి చేరుకుంటావు. అదేవిధంగా నువ్వు ఆత్మని తెలుసుకొనే ప్రయాణంలో ఉంటే, నువ్వు తప్పనిసరిగా నీకు తెలియకుండా, ఆత్మని పొందుతావు.

ఓ అరుణాచలేశ్వరుడా, నేను అంతగా పాడైపోలేదు, బొత్తిగా భ్రష్టుడిని అయిపోలేదు. కుక్క చేసే పని నేనూ చేయగలను అరుణాచలేశ్వరుడా! నేను చేయలేను అనుకొంటున్నావేమో, నిన్ను గుర్తు పట్టుకుంటాను, నీ గుట్టు తెలుసుకుంటాను, నీ ఆరా తీసుకుంటాను, నీ కోసం వెదుకుతాను, నిన్ను చేరుకుంటాను, ఇది నా గమ్యం ఓ అరుణాచలేశ్వరుడా! నిన్ను నేను విడిచిపెట్టను, నిన్ను తప్పనిసరిగా చేరుకునే తీరతాను, నీ స్వరూపం నేను పొందుతాను అరుణాచలేశ్వరుడా.

**అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలశివ అరుణాచలా!**

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. 520101264185724
**CORPORATION BANK, PALAKOL BRANCH**
IFSC Code : **CORP0001613, Contact No. 9866715896**

# స్వరూపమే మోక్షం

భగవాన్ శ్రీ రమణమహర్షిని ఎవరైనా నేను మోక్షాన్ని ఎలా పొందాలి? అని ప్రశ్నిస్తే, దానికి బదులుగా వచ్చిన త్రోవనే పో! అనేవారు. శరీరం వచ్చిన త్రోవనే తిరిగి వెనుకకు వెళితే, బయలుదేరిన చోటుకే తిరిగి వెళుతుంది. మరొక విధముగా చూస్తే శరీరము పంచభూత నిర్మాణము కాబట్టి, అది నశిస్తే, తిరిగి పంచభూతాల రూపంలోనే ఉంటుంది. "త్వరగా మాకు ముక్తి మార్గాన్ని చూపండి" అని భగవాన్‌ని కొంతమంది అడిగినప్పుడు, మీ ఇంటికి మీరు చేరడానికి మార్గం ఎలాగ? అని అడిగినట్లుంది అనేవారు. మనకు ప్రధాన సమస్య మనస్సు, శరీరం కాదు. మనస్సు దాని మూలమైన బ్రహ్మము ఆధారంగా ఉదయించి, జాగ్రదవస్థలో దేహతాదాత్మ్యం చెంది, దేహమే - నేను అని భావించి, జగజ్జీవేశ్వరులను వేరువేరుగా గుర్తిస్తోంది. మనస్సు గాఢనిద్రలో తన మూలములో లయమై, తన ఉనికినే కోల్పోయిన కారణంగా, మనకు శరీరరము తోచుట లేదు. ద్వైతబుద్ధికి కారణమైన మనస్సు, వచ్చిన త్రోవనే వెనుకకు వెళితే, అది దాని మూలమైన హృదయాన్ని చేరుకుంటుంది. మనోమూలమే హృదయం, అదే సత్యము, అదే నేను. నేను మోక్షాన్ని పొందాలి అనేది ఒక తలంపే! అది అహంకారానికి వచ్చే మరొక తలంపు. కాని అహంకారం యొక్క మూలములోనే మోక్షం స్వరూపంగా ఉంది. అదే నేను! అదే సకలమునకు ఆధారం! పరమాత్మ కన్న భిన్నముగా ఏదీ లేదు, వ్యక్తిని అని భావించే నేను కూడా పరమాత్మే! అన్న అనుభవమే మోక్షం.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# శ్రీనాన్నగారు జన్మించనూ లేదు - మరణించనూ లేదు

సద్గురు శ్రీనాన్నగారు 1934 సెప్టెంబరు 23వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా కొమ్మర గ్రామంలో శరీరాన్ని ధరించి, 2017 డిసెంబరు 29వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు వైకుంఠ ఏకాదశి రోజున శరీరాన్ని విడిచారు. అంటే పై తేదీల మధ్య ఈ లోకాన్ని ఒకసారి సందర్శించి శరీరాన్ని వదిలారు. అంతే ఆయన నిజానికి ఈ అంకెలకు, లంకెలకు అతీతులు. ఆయన బోధలను ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు కాని మరిచిపోలేని నగ్న సత్యం ఆయన చిరునవ్వు చిందించేవారు. ఆయన్ని ఓ చట్రంలో ఇమడ్చలేము. ఏ సిద్ధాంతంలోనూ బంధించలేము. మతాలకు అతీతులు. ఆయనది అంతర్జాతీయ వాణి. 20వ శతాబ్దిలో ఈ భూమి మీద తిరుగాడే శక్తివంతులలో ఒకరిగా గుర్తించారు ప్రజలు. ఆయన బోధలలో అంశాలు “మనలో స్వర్గనరకాలు ఉన్నాయి అది మన ఎంపిక వాడు చెడ్డవాడు, వీడు మంచివాడు అనే భావన వద్దు యదార్థంగా (ఆత్మగా) చూడాలి. ఏదో ఒక కారణంతో ఇంద్రియ సుఖాల ఆనందం క్షణికం కొన్ని సెకనులు ఉంటుంది. అకారణమైన ఆనందం (ఆత్మానందం) మనం బ్రతికి ఉన్నంతకాలం తోడుగా ఉంటుంది. అంటే చనిపోయినా అందులోనే ఉంటాము. అమూల్య సంపదల చుట్టూ తిరిగి అదే గొప్ప జీవితం అనే జీవిస్తూ మరణిస్తున్నాము. ఆ జీవితం జీవితమే కాదు. కొరుకుడుపడని (నేను ఎవడను) అన్న విషయాన్ని కూడా పరమసరళంగా చెప్పగలిగే నైపుణ్యాన్ని సాధించారు అదే ఆయనను కోట్లాదిమందికి ఆరాధ్య దైవంగా మార్చేసింది. ఆ మాటలనే భక్తులు మంత్రాల్లా తలచుకొంటారు, నెమరు వేసుకుంటూ పంచుకొంటారు. ఆయన చెప్పే విషయంలో ఎంతో సాంద్రత ఉంటుంది, అభివ్యక్తంలో అంత సరళంగా ఉంటుంది. వారి ఉచ్ఛారణ చెవుల్లో, మనస్సులో అమృతం పోసినట్లు ఉంటుంది. ఆయన తడిమి చూడని లోతులు లేవు. ఆ మాటల్లో డోలాయమానం ఉండదు. బుల్లెట్ దిగినట్లు ఉంటుంది వాక్యం. వినేవాడిలోనూ అంత స్పష్టత ఉంటుంది. అర్థం కాకపోవటాలు, అర్థమైనట్లు అనిపించటాలు ఉండవు, నిఖార్సయిన నిజం కట్టెదుట నిలబడినట్లు అనిపిస్తుంది. అది దేవుడి గురించి కావచ్చు, దాంపత్య జీవితం గురించి కావచ్చు. గురుదేవులు చెప్పేది ఒకటా రెండా మనిషి జీవితాన్ని ప్రభావితం చేసే ప్రతీ విషయం మీద సాధికారికంగా మాట్లాడతారు. కుండబద్దలుకొట్టినట్లు తన అభిప్రాయాన్ని తెలుపుతారు. తాత్వికునిగా ఆయన ఆలోచనల్లోని నిజాయితీని ఆయన వాదనా పటిమలోని చిక్కదనాన్ని తేలికగా తీసిపారేయలేము. పుట్టిన రోజు అంటే అందరికీ పుట్టినది ఎందుకో తెలిసింది ఎందరికో అన్న నానుడి పుట్టినరోజు ఎందుకో తెలిజెప్పటానికి ఆయన ప్రవచనాల ద్వారా కొన్నివేల సంవత్సరాలు సజీవంగా ఉండగలిగేంత సత్తా ఆయన మాటల్లో ఉంది. శివానందం వారి నెత్తిమీద చెయ్యివేసి “బి గుడ్ - డూ గుడ్” అని చిరుప్రాయంలోనే ఆశీర్వదించారు. అలాగే మలయాళస్వామి, జెకె కంచిపరమాచార్యుల ప్రత్యక్ష సమక్షంలో గడిపారు. భగవాన్ తీర్చిదిద్దిన అనుంగ శిష్యునిగా గణుతికెక్కారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**